మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 13-7-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 14 Issue: 14

13 జూలై 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:53 సూర్యాస్తమయం - సా. 6:50 తిథిః తదియ రా. 1:010 వరకు తరువాత చవితి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం శ్రవణ ఉ. 6:44 వరకు తరువాత ధనిష్ఠ యోగం ప్రీతి సా. 5:57 వరకు కరణం వనిజ మ. 1:24 వరకు విష్టి రా. 1:010 వరకు వర్జ్యం ఉ. 10:52 నుండి మ. 12:28 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:13 నుండి సా. 6:50 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:59 వరకు గుళికకాలం మ. 3:36 నుండి సా. 5:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:17 నుండి తె. 5:05 వరకు అమృత ఘడియలు రా. 8:25 నుండి రా. 10:00 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు

Published from Jagitial
www.evarthalu.com


## హెచ్‌వోడీ లైంగిక వేధింపులు..



ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. గురువే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకెళితే.. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఓ విద్యార్థిని ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు.

2

## ఇన్సూరెన్స్ డబ్బుల కోసం..




ఇన్సూరెన్స్ డబ్బుల కోసం అత్తనే హత్య చేశాడో అల్లుడు. ఈ దారుణ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. తొగుట మండలం పెద్దమసాన్ పల్లికి చెందిన తాళ్ల వెంకటేశ్ వ్యాపారం చేసి రూ.22 లక్షలు నష్టపోయాడు. ఈ అప్పుల ఊబిలోంచి ఎలాగైన బయటపడాలనుకున్నాడు. తన అత్త తాటికొండ రామవ్వ పేరుపై ఇన్సూరెన్స్ చేయించి ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నట్టే స్థానిక పోస్టాఫీస్, ఎస్బీఐ బ్యాంకులో ఇన్సూరెన్స్ చేయించాడు.

2

## సెల్ఫీ దిగుదామని నమ్మించి..



సెల్ఫీ దిగుదామని నమ్మించి భర్తను భార్య నదిలోకి తోసేసిన ఘటన కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో జరిగింది. రాయచూర్జిల్లాకు చెందిన తాతప్పను అతడి భార్య కృష్ణానది వద్దకు తీసుకెళ్లింది. సెల్ఫీ దిగుదామని చెప్పడంతో భర్త ఒకే అన్నాడు. ఇద్దరు కలిసి వంతెన చివరికి నడుచుకుంటూ వెళ్లారు. సెల్ఫీ దిగుతుండగా భార్య ఒక్కసారిగా భర్తను నదిలోకి తోసేసింది.

2

# మిత్తీలకే.. సరిపాయే!

రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోంది

## రాష్ట్ర ఆదాయం అంతా వడ్డీల పాలు

## ప్రమాదకరంగా అధిక వడ్డీ రుణాలు

### మహేంద్రదేవ్‌తో భేటీలో సీఎం రేవంత్.. సీజేఐ గవాయ్‌తోనూ సమావేశం



వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని, రుణాలపై వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్ మహేంద్రదేవ్ శనివారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అంశాలపై చర్చించారు.

హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపా యాల కల్పనపై దృష్టి సారించినట్లు సీఎం వివరించారు. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళు న్నామని, మూడు రంగాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలియజేశారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ఆందోళన వ్యక్తం చేశారు. అధికశాతం వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఇలాంటి విధానం ద్వారానే, సమాఖ్య వ్యవస్థ బలోపేతమవుతుందని, దేశాభివృద్ధి సాధ్యమ వుతుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకా శాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్, ఆర్ఆర్ఆర్‌ను ఔటర్‌తో అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పర్యటనలో ఉన్న సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందించారు.

## నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్



2



## ఆ ఒక్క సెకను..!

క్షణ కాలం పాటు ఆగిన ఇంధన స్విచ్‌లు

విమానానికి ఇంధన సరఫరా నిలిచిపోయింది

ఎయిరిండియా దుర్ఘటనపై ఏఏఐబీ ప్రాథమిక నివేదిక

న్యూఢిల్లీ: ఇంధన స్విచ్‌లు ఆగిపోవడంతోనే అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిందని ఈ ప్రమాదంపై నిర్వహించిన ప్రాథమిక నివేదిక స్పష్టం చేసింది. ఈ దుర్ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను శనివారం విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెల్లడించింది. 'విమానం టేకాఫ్ అయిన సెకను వ్యవధిలోనే రెండు

తరువాయి 2 వ పేజీలో...



## శ్రీశైలం దారిలో భారీగా ట్రాఫిక్ జాం

12 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

2




# ఈయూ, మెక్సికోపై 30%

## అమెరికా సుంకాల బాదుడు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. మెక్సికో సహా ఈయూ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు విధించారు. ఈ సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు.

న్యూయార్క్: ఈ మేరకు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌కు అమెరికా సర్కారు లేఖ రాసింది. మరోవైపు పొరుగు దేశం కెనడా నుంచి దిగుమతయ్యే సరకులపై 35 శాతం సుంకాలను విధించనున్నట్లు, ఇవి ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కుదరనుందన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. కెనడానే కాకుండా 20 నుంచి 50శాతం వాణిజ్య సుంకాలు విధిస్తామని పేర్కొంటూ బ్రెజిల్, జపాన్ వంటి 23 దేశాలకు ట్రంప్ ఇటీవల లేఖలు పంపిస్తున్నారు.

## హద్దుల్లో ఉండాల్సిందే

### వీసాదారులకు అమెరికా వార్నింగ్

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది.

## విశ్వవాణి



ప్రపంచంలోనే అత్యంత లోతైన, అత్యంత పొడవైన అండర్ వాటర్ రోడ్ టన్నెల్‌ను నార్వే ప్రభుత్వం నిర్మిస్తోంది. ఇందుకోసం ఏకంగా రూ.17 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే కార్లు సముద్రానికి 1,300 అడుగుల లోతులో వాహనాలు ప్రయాణించాల్సి ఉంటుంది.

# జనాభానే మన శక్తి

### ప్రజాస్వామ్యం భారత దేశ బలం.. రోజ్‌గార్ మేళాలో ప్రధాని స్పష్టీకరణ



వికసిత భారత నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడంలో ప్రభుత్వాన్నికున్న నిబద్ధతను రోజ్‌గార్ మేళా ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన శనివారం ఢిల్లీలో జరిగిన 16వ ఎడిషన్ రోజ్‌గార్ మేళా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజాగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో కొత్తగా చేరిన 51 వేలకు పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు.

న్యూఢిల్లీ: కొత్తగా ఉద్యోగంలో చేరిన వారిని ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ 'మీరు నూతన ప్రయాణం సాగిస్తున్న తరుణంలో మిమ్మల్ని అభినందిస్తున్నాను. భారతదేశానికి రెండు శక్తులు ఉన్నాయని ప్రపంచం భావిస్తోంది. అవి ఇక్కడి జనాభా, ప్రజాస్వామ్యం. నేను ఇటీవలే ఐదు దేశాల పర్యటన నుండి తిరిగి వచ్చాను. ఈ సందర్భంగా ఇతర దేశాలతో మనం చేసుకున్న ఒప్పందాలు ఖచ్చితంగా మన యువతకు ప్రయోజనం చేకూరుస్తాయి' అని ప్రధాని పేర్కొన్నారు. యువత ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తూ కేంద్రం రోజ్‌గార్ మేళా నిర్వహిస్తోంది. యువతకు సాధికారత కల్పించడం, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడం కోసం దీనిని చేపట్టింది. రోజ్‌గార్ మేళా ప్రచారం ప్రారంభించినప్పటి నుంచి, దేశవ్యాప్తంగా 10 లక్షలకుపైగా నియామక ఉత్తర్వులు అందించారు. 16వ -2 వ పేజీలో...




# సవాలక్ష సవాళ్లు

## లాయర్ నిరంతరం తమను తాము నిరూపించుకోవాలి

### కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహన ఉండాలి

### న్యాయవాద వృత్తిలో ఏఐ వినియోగానికి చాన్స్

### నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో జస్టిస్ గవాయ్

'న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాలి. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించేవారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి.

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. -2 వ పేజీలో...



## రప్పా రప్పా కాదు.. కనుసైగలతోనే పనైపోవాలి

### ఏపీ మాజీమంత్రి పేర్నినాని సంచలన వ్యాఖ్యలు

### కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు

గుడివాడ: రప్పా రప్పా అని నరుకుతామని అరవడం కాదని, కనుసైగతోనే పని అయి పోవాలంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కృష్ణాజిల్లాలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం -2 వ పేజీలో...

ఈవార్తలు



# రాశి ఫలాలు

13.7.2025

మేషం: దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘ కాలిక ఆరోగ్యసమస్యలు భాదిస్తాయి. బంధు మిత్రులతో ఆకస్మిక వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. దైవ చింతన పెరుగుతుంది. వ్యాపారాలు అంతగా కలిసిరావు.

వృషభం: స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలిసి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన ఆశించిన లాభాలు అందుకుంటారు. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో కీలక విషయాలు చర్చిస్తారు. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అనుకూలత కలుగుతుంది.

మిధునం: సోదరులతో ఆస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. వాహన వ్యాపారస్తులు నూతన లాభాలు అందుకుంటారు. అవసరానికి సన్నిహితులు సాయం అందుతుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో హెూదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. గృహెూపకరణాలు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు సూచనలున్నవి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలలో కొంత చికాకు తప్పదు. ఇంటా బయట అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగమున అదనపు బాధ్యతలుంటాయి. ఆర్థికంగా కొంత నిరాశ తప్పదు.

సింహం: తల్లి తండ్రుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు. బంధువులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోమున అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలించక నిరాశ పెరుగుతుంది.

కన్య: నూతన పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తిచేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగ యత్నాలలో విజయం సాధిస్తారు. సంఘంలో స్నేహితుల నుండి ఊహించని ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక పురోగతి సాధిస్తారు. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ప్రయాణాల వలన శారీరక శ్రమ పెరుగుతుంది. బంధుమిత్రుల నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారమునకు పెట్టుబడులు సకాలంలో అందవు. వృత్తి ఉద్యోగాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు.

వృశ్చికం: అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యుల ఆదరణ పెరుగుతుంది. భూ సంబంధిత క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారములు పుంజుకుంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల సహాయ సహకారాలు అందుతాయి.

ధనస్సు: వృత్తి వ్యాపారమున నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది.

మకరం: సన్నిహితుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఉద్యోగ విషయమై ఆశించిన మార్పులు చోటు చేసుకుంటాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

కుంభం: కీలక వ్యవహారాలలో స్వంత నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభాలుంటాయి. స్థిరాస్తి సంబంధిత వివాదాల నుంచి బయటపడతారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పనికి తగిన గుర్తింపు లభిస్తుంది.

మీనం: కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల నుండి మాటలు పడవలసి వస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభానికి ఆటంకాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. తగినంత ఆదాయం లభించదు. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడిపెరుగుతుంది.

# లాయర్‌కు సవాలక్ష సవాళ్లు

**మొదటి పేజీ తరువాయి**

'న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాలి. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించేవారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలం. మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలి. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం' అని పేర్కొన్నారు. జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయ రంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు ఎవరేం చెబుతున్నారు.. అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం అన్నారు. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి. ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలుచేయడం అవసరం లేదని చెప్పారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

## నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

### పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్,జులై 12: తెలంగాణలో బోనాల జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇప్పటికే గోల్కొండ బోనాలు ముగియగా సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిన మహంకాళి బోనాలు జరగనున్నాయి. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లక్షల మంది భక్తులు తరలి వచ్చే అవకాశంతో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది ప్రభుత్వం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటోంది. ఆదివారం మహంకాళి బోనాలకు ఉదయం 4.10 బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ ధర్మకర్త కుటుంబం నుంచి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు. సోమవారం రోజు రంగం భవిష్యవాణితో పాటు అమ్మ వారి అంబారి ఊరేగింపు, ఆదివారంరాత్రి, సోమవా రం రాత్రి అమ్మవారి ఫలహర బండ్ల ఊరేగింపు ఉంటుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం 6 క్యూలైన్ లు ఏర్పాటు చేశారు భక్తులు. బాట షోరూం నుంచి 2 , రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ నుంచి 2, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 2 క్యూలైన్లు ఉన్నాయి. క్యూ లైన్ లో 16 మీటర్లకు ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు చేశారు. భారీ పోలీస్ బందోబస్తుతో పాటు 70 సీసీటీవీ కెమెరాల నడుమ బోనాల జాతర జరగనుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా, మొబైల్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. శివ శక్తులు, జోగినిల కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు సమయం కేటాయించారు.

## వీసా వచ్చినా హద్దుల్లో ఉండాల్సిందే

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని స్పష్టంచేసింది.

## శ్రీశైలం దారిలో భారీగా ట్రాఫిక్ జాం

శ్రీశైలం: వారాంతపు వరుస సెలవులు రావడం.. దానికి తోడు శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువైంది. దీంతో హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు చీమల బారులు తీరినట్లుగా రోడ్డుపై నిలిచిపోయాయి. శనివారం శ్రీశైలం వెళ్లే దారిలో దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు 12 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. 3 గంటలకు పైగా వాహనాలన్నీ రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నల్లమల అడవి మార్గంలో రోడ్లపై కిలోమీటర్ల మేర వేల వాహనాలు నిలిచిపోవడంతో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గేట్లను ఎత్తడంతో డ్యాం సందర్శకులకు ఆకర్శనీయంగా కనువిందు చేస్తోంది. నల్లమల ప్రకృతి అందాలు, డ్యాంను చూడటంతో పాటు శ్రీశైల ఆలయ దర్శనం కోసం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేల వాహనాలు రోడ్లపైన బారులు తీరాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు మరింత సమయం పట్టనుందని పోలీసులు తెలిపారు. శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో శనివారం మూడు గేట్లను మూసేశారు అధికారులు. ప్రస్తుతం ఒక గేటు ద్వారా 4,497 క్యూసెక్కుల నీరు నాగార్జున సాగర్ కు చేరుతోంది. సుంకేసుల, జూరాల నుంచి 1,37,635 క్యూసెక్కుల ఇనో వస్తుంది. జూలై నెలలోని శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి.. డ్యామ్ పూర్తి స్థాయిలో నిండింది.

## కనుసైగలతోనే పనైపోవాలి

**మొదటి పేజీ తరువాయి**

అధికారంలోకి వచ్చాక.. ఇప్పుడు తప్పులు చేసిన వాళ్లను నరికేద్దామంటూ కార్యకర్తల్ని రెచ్చగొట్టారు. కూటమి నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటామంటూ పరోక్షంగా హెచ్చరించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పేర్ని నానిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో రప్పా రప్పా అనటం కాదు చేసి చూపించండి.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పేర్ని నాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు.. అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ బియ్యం దొంగ పేర్ని నాని.. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు పేర్ని నాని వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం కార్యక్రమాల్లో మాజీ మంత్రి పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోకేష్ రెడ్ బుక్ అంటే.. మీరు రప్పా రప్పా అంటున్నారు.. ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలే తప్ప.. రప్పా రప్పా అని అనటం కాదు.. అంటూ కార్యకర్తలకు సూచించారు.

## హెచ్‌వోడీ లైంగిక వేధింపులు..

### కాలేజీలోనే నిప్పంటించుకున్న విద్యార్థిని

భువనేశ్వర్: ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. గురువే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకెళితే.. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఓ విద్యార్థిని ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వేధింపులకు గురిచేస్తున్న అధ్యాపకుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన బాధిత విద్యార్థిని.. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా కాలేజీ క్యాంపస్‌లో నిరసన చేపట్టింది. శనివారం ఉదయం కూడా తోటి విద్యార్థులతో కలిసి కాలేజీ ముందు ఆందోళనకు దిగింది. అదే సమయంలో ప్రిన్సిపల్ కార్యాలయానికి ఒక్కసారిగా పరుగెత్తిన ఆమె.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. తోటి విద్యార్థులు ఆమెను రక్షించే ప్రయత్నం చేయగా, మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సదరు లెక్చరర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## ఇన్సూరెన్స్ డబ్బుల కోసం.. అత్తను చంపిన అల్లుడు

సిద్దిపేట, జులై 12 (ఈవార్తలు): ఇన్సూరెన్స్ డబ్బుల కోసం అత్తనే హత్య చేశాడో అల్లుడు. ఈ దారుణ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. తొగుట మండలం పెద్దమసాన్‌పల్లికి చెందిన తాళ్ల వెంకటేశ్ వ్యాపారం చేసి రూ.22 లక్షలు నష్టపోయాడు. ఈ అప్పుల ఊబిలోంచి ఎలాగైన బయటపడాలనుకున్నాడు. తన అత్త తాటికొండ రామవ్వ పేరుపై ఇన్సూరెన్స్ చేయించి ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నట్టే స్థానిక పోస్టాఫీస్, ఎస్బీఐ బ్యాంకులో ఇన్సూరెన్స్ చేయించాడు. రైతు బంధు రూ.5 లక్షల వరకు వస్తుందని, తెలుసుకుని తన పేరుపై ఉన్న 28 గుంటల భూమిని సైతం అత్త రామవ్వ పేరుపై చేయించాడు. కరుణాకర్ అనే వ్యక్తి సాయంతో అత్తను చంపాలని నిర్ణయించుకున్నాడు. టీఎస్ 18 0 2277 థార్ అద్దెకు తీసుకున్నారు. తన అత్తను వెంకటేశ్ తుక్కాపూర్‌కు తీసుకురాగా, కరుణాకర్ థార్ వాహనంతో ఢీకొట్టి పారిపోయాడు. వెంటనే తన అత్త చనిపోయిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే వెంకటేశ్ ఈ దారుణానికి పాల్పడ్డట్లు గుర్తించారు.అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నేరం ఒప్పుకున్నాడు.

## సెల్ఫీ దిగుదామని నమ్మించి.. భర్తను నదిలోకి తోసేసిన భార్య

మహబూబ్‌నగర్, జూలై 12 (ఈవార్తలు): సెల్ఫీ దిగుదామని నమ్మించి భర్తను భార్య నదిలోకి తోసేసిన ఘటన కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో జరిగింది. రాయచూర్జిల్లాకు చెందిన తాతప్పను అతడి భార్య కృష్ణానది వద్దకు తీసుకెళ్లింది. సెల్ఫీ దిగుదామని చెప్పడంతో భర్త ఓకే అన్నాడు. ఇద్దరు కలిసి వంతెన చివరికి నడుచుకుంటూ వెళ్లారు. సెల్ఫీ దిగుతుండగా భార్య ఒక్కసారిగా భర్తను నదిలోకి తోసేసింది. వెంటనే ఇంట్లో వాళ్లకు ఫోన్ చేసి.. ప్రమాదవశాత్తు జారిపడ్డాడని చెప్పింది. అయితే, అతడు కొంతదూరం కొట్టుకుపోయి ఓ బండ రాయి సాయంతో బతికి బట్టకట్టాడు. స్థానికులు గుర్తించి తాడు సాయంతో అతన్ని బయటకు లాగారు. పైకి వచ్చాక తన భార్యే నదిలోకి తోసేసిందని చెప్పడం గమనార్హం. అయితే, భర్తే ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడని భార్య బుకాయిస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి.. పలు కోణాల్లో విచారణ చేపట్టారు.



# ఆ ఒక్క సెకను..!

ఇంధన కటాఫ్ స్విచ్‌లు ఆఫ్ అయ్యాయి. దీంతో రెండు ఇంజిన్లు గాలిలోనే ఆగిపోయాయి. రెండు స్విచ్ లు ఒకేసారి ఆఫ్ అవడంతో ఇంధన సరఫరా నిలిచిపోయింది. ఫ్యూయల్ కట్‌ఆఫ్ స్విచ్‌లు.. రన్ నుంచి కటాఫ్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. అది కేవలం సెకన్ లోనే జరిగింది. దీంతో ఇంజిన్లు గాలిలోనే నియంత్రణ కోల్పోయాయి' అని నివేదిక పేర్కొంది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను పూర్తిగా పరిశీలించామని, అలాగే, విమానానికి సంబంధించి రెండు ఇంజిన్లను వెలికితీసి, భద్రపరిచినట్లు పేర్కొంది. ప్రమాదానికి ముందు విమానంలో ఫ్యూయెల్, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని తెలిపింది. అలాగే, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏవీ లేవని వెల్లడించింది. రెండు ఇంజిన్లు ఒకేసారి ఆగిపోవడంతో విమాన ప్రయాణ వేగం, ఎత్తులో శ్రీఘ్ర మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. అలాగే, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని, విమానంపై దాడి జరిగినట్లు చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది. కాక్‌పిట్ ఆడియో సంభాషణల ప్రకారం ఇంధన స్విచ్‌ను ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది. విమానం కేవలం 32 సెకన్లు మాత్రమే గాలిలో ఎగిరింది. రన్‌వేకు 0.9 ఎన్ఎం దూరంలో విమానం కూలి ఓ హాస్టల్‌పై పడింది. ఈ ప్రమాదానికి పక్షి ఢీకొట్టడం, వాతావరణ సంబంధిత సమస్యలు కారణం కాదని నివేదిక పేర్కొంది.

# జనాభానే మన శక్తి

**మొదటి పేజీ తరువాయి**

ఎడిషన్ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 47 ప్రదేశాలలో జరిగింది. రైల్వే మంత్రిత్వ శాఖ, హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పోస్టల్ శాఖ, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల శాఖ, కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలతో సహా వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో నియామకాలు జరుగుతున్నాయి.

## విద్య, ఉద్యోగవాణి

కంపెనీ: సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికాల్ టెక్నాలజీ, హైదరాబాద్

పోస్టు పేరు: అసోసియేట్ రిసెర్చ్ ఫెలో పోస్టుల ఇంటర్వ్యూ

మొత్తం పోస్టుల సంఖ్య: 30

ఇంటర్వ్యూ తేదీలు:17,18జూలై2025

క్లరికల్ ట్రైనీ పోస్టులు

కంపెనీ: కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, విశాఖపట్నం

పోస్టు పేరు: క్లరికల్ ట్రైనీ పోస్టులు

మొత్తం పోస్టుల సంఖ్య: 45

దరఖాస్తు రుసుము: రూ.100

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

దరఖాస్తు చివరి తేదీ:16.07.2025

# బీసీలకు రేవంత్ మళ్లీ మోసం

## రాష్ట్రపతి వద్ద బీసీ బిల్లు పెండింగ్.. అలాంటప్పుడు ఆర్డినెన్స్ చెల్లుబాటు కాదు.. సీఎంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 12 (ఈవార్తలు): బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. శనివారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు ఉందని నొక్కిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తేలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2021లో వికాస్ కిషన్‌రావు వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.







# డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి డీజీఎల్ఏ విజ్ఞప్తి

సోమాజిగూడ, జూలై 12: గత ఏడాది కాలేజీల్లో విధులు నిర్వర్తించిన ప్రతి డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్‌తో పాటు సర్వీస్ కంటిన్యూ చేయాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ (డీజీఎల్ఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్, కోఆర్డినేటర్ పీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నరేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో వారు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రతి నెల 50 వేల కన్సలిడేటెడ్ పేతో ఏడు నెలలకు కాకుండా 12 నెలలకు వేతనం చెల్లించాలని, గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డిగ్రీ రెసిడెన్షియల్, డీఎడ్, బీఎడ్, ఎంఎడ్, యూనివర్సిటీల్లో పార్ట్ టైం లెక్చరర్లను, ఇంటర్ గెస్ట్ లెక్చరర్లను ఒక్కసారి డెమోతో ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తున్నారని , డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను మాత్రం త్రీ మెన్ కమిటీ పేరుతో డెమోల ద్వారా నియామకాలు చేపట్టడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. విద్యావ్యవస్థ పటిష్టత, విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్న ప్రభుత్వం డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నేతలు ఏ అశోక్, శివుడు, టీ గోపాల్, ఎస్ రాజు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రచామెక్కువ.. పని తక్కువ

### స్కూటీలు, పెళ్లికి లక్ష, తులం బంగారం ఎక్కడ?

### కాంగ్రెస్ సర్కారుపై ఎమ్మెల్సీ కవిత మండిపాటు

రంగారెడ్డి, జూలై 12 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటనలో ఎమ్మెల్సీ కవిత.. ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ పాలనను టార్గెట్ చేసిన ఆమె, ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించిన కవిత.. సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్‌నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను తక్కువ చేశారని, ఫ్రీ పథకాలు అందిస్తామనే చెప్పి సేవలు కట్ చేసిన దారుణ పాలన ఇది అని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని కూడా ఆరోపించారు. ఇది పనిచేసే ప్రభుత్వం కాదు.. ప్రజలే వెంటే ఉండి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హేళన చేసిన కవిత, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

భద్రాచలం, జూలై 12 (ఈవార్తలు): భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయానికి నీటిమట్టం 40.5 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నది ఉద్ధృతి వల్ల గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండు రోజుల క్రితం 23 అడుగులు ఉన్న గోదావరి ప్రవాహం.. నేడు 40.5 అడుగులకు చేరింది. దీంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు వరదనీటిలో మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. సీత వాగు వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ వారి విగ్రహం వరద నీటిలో మునిగిపోయింది. గోదావరిలో నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

# పంటలెండుతున్నయ్.. కాపాడండి

### మంత్రి తుమ్మలకు రైతుల వినతి

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల ఆలస్యమవుతోందని, సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదల చేయాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు. ఇవాళ సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.



# సీతారామ ప్రాజెక్టు నీటి విడుదల

## మోటర్‌కు స్విచ్ ఆన్ చేసిన మంత్రి ఉత్తమ్

ఖమ్మం, జూలై 12 (ఈవార్తలు): గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు శనివారం సీతారామ ప్రాజెక్టులో భాగంగా అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద ఏర్పాటుచేసిన ఎత్తిపోతల నుంచి ఒక మోటారు ఆన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటపడి సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించే పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం గోదావరికి వరద ఉద్ధృతంగా వస్తోంది. మరో వైపు పాలేరు వద్ద అండర్ టన్నెల్ గత ఏడాది కూలిపోయింది.. దీంతో సాగర్ జలాలు ఖమ్మం జిల్లాలోని పంటపొలాలకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. మరో పదిరోజులు వరకు నీరు రాని పరిస్థితి. దీనివల్ల తల్లాడ, కల్లూరు మేజర్ల కింద పొలాలు ఎండిపోతున్నాయి.. దీనిని దృష్టిలో పెట్టుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు కింద కొత్తూరు వద్ద ఏర్పాటు చేసిన మోటార్లలో ఒక దానిని శనివారం ఆన్ చేశారు. దీనివల్ల గోదావరి జలాలు ఏన్కూరు వద్ద సాగర్ కాలువలో ప్రవేశించి తల్లాడ, కల్లూరు మేజర్ల కింద ఉన్న సుమారు 30వేల ఎకరాల్లో ఉన్న వరిపంటను రక్షించేందుకు అవకాశం ఉంది. సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోయినప్పటికీ అవకాశం ఉన్న మేరకు మోటార్లు బిగించి ఖమ్మం జిల్లా రైతును ఆదుకోవడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయమని రైతులు తెలిపారు.

### ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, సహాయ పునరావాస పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలపై సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చాలా కాలంగా భూసేకరణలో జాప్యం కారణంగా గడువులోగా పనులు పూర్తికావడం లేదన్నారు. అంచనా వ్యయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు భూ యజమానులు తదితరులతో సంప్రదింపులు జరపాలి. పరిహారం, పునరావాస ప్రక్రియను పారదర్శకంగా, సున్నితంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఆలస్యం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో పాటు చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. తద్వారా పనులకు ఆటంకం కలుగుతుంది. జిల్లా స్థాయిలో సమన్వయం ఎంతో ముఖ్యమని.. పనుల పురోగతికి ఆటంకంగా మారిన సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి స్థాయిలోనూ పనులు సాఫీగా జరగాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరాతీసిన మంత్రి ఉత్తమ్.. ముఖ్యమైన సమస్యలను గుర్తించారు. వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు ప్రాజెక్టులు ఎంతో ముఖ్యమన్నారు. కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే కీలకమైన పాలమూరురంగారెడ్డి, సీతారామ సాగర్ ప్రాజెక్టుల పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కాలువ లైనింగ్ మొదలు సొరంగాల వరకు ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు.



# అసలు కవితది ఏ పార్టీ?

### పదేళ్లలో రిజర్వేషన్‌పై మాట్లాడలేదేం?.. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు

### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

నల్లగొండ, జూలై 12 (ఈవార్తలు): రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని.. అక్కడ ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని, ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని పొన్నంకి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



# పొలాలకు నీళ్లు రాకుండా ఆపుతున్నారు

### సర్కారుపై మాజీమంత్రి హరీశ్ మండిపాటు

సిద్దిపేట: కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కావాలనే పదేపదే కాళేశ్వరం కూలిపోయిందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండా పక్కన పెట్టారని అన్నారు. సిద్దిపేటలో 167 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. వర్షాలకు గోదావరిలో 8 లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి. మోటార్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నారు. మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్ నిండిపోతుంది. మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయి. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కాళేశ్వరంలో భాగం కావా? ఇవేమీ చూడకుండా కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చపెడితే.. మీరేం చేశారో.. మేమేం చేశామో మాట్లాడుకుందాం. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే ఆరు నెలల్లో నీళ్లు ఇవ్వొచ్చు. మేం ప్రశ్నించడంతోనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేశారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు. ఓట్లకు ఓట్లకు మధ్య మీరు రైతుభరోసా ఇస్తున్నారు. రైతుభరోసాను ఎలా కోత పెడదామనే చూస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

# 9 మందికి కిడ్నీలు ఫెయిల్

### కల్తీ కల్లు ఘటనలో పెరుగుతున్న బాధితులు

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులకు వైద్యం కొనసాగుతోంది. కల్తీ కల్లు బారిన పడిన వారిలో 33 మంది నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కిడ్నీ పనిచేయని బాధితుల సంఖ్య తొమ్మిది మందికి చేరింది. ఇప్పుడు తాజాగా మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు. మరో 19 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ కల్తీ కల్లు ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇక కల్తీ కల్లు ఘటనలో ప్రధాన నిందితుడు కూన సత్యం గౌడ్‌ను కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన కుమారులు రవితేజ గౌడ్, సాయితేజ గౌడ్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. కూన సత్యం గౌడ్ అరెస్ట్‌తో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది.

# రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించాలి: పాయల్ శంకర్

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించడం లేదని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.



# టీటీడీలో అన్యమతస్థులు నిజమే

## విచారణ కొనసాగుతోంది: ఆనం.. టీటీడీ ఈవోతో భేటీ

తిరుమల,జులై 12: టీటీడీలో అన్యమతస్థులు ఉండేది వాస్తవమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. టీటీడీలో వెయ్యి మంది అన్యమతస్థులు ఉన్నారన్న కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ కొనసాగుతోందన్నారు. అయితే ఎవరున్నా వారిని తొలగిస్తామని అన్నారు. రాష్ట్రంలో అర్చక నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు భృతి ఇవ్వాలని మేనిఫెస్టోలో ఉందని దేవాదాయశాఖ మంత్రి అన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 మంది వేద పండితులు నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.147 కోట్లు విడుదల కాకుండా నిలిచిపోయాయన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో రూ.11 కోట్ల నిధులు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని తెలిపారు. వీటన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు, అధికారులు చెప్పారని మంత్రి వెల్లడించారు. తిరుమలలో టీటీడీ, దేవాదాయశాఖ సంయుక్త సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష చేశామన్నారు. గతంలో సీఎం చంద్రబాబు దగ్గర జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయని.. వాటిని చర్చించుకొని రండి అని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయని చెప్పారు. గతంలో 5 శాతం ఉన్న దానిని 9 శాతానికి పెంచామని తెలిపారు. విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్‌లతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. సీఎం చంద్రబాబు ఆదేశాల



మేరకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తొలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల వివరాలు, ఆలయాల పునరుద్ధరణ మరియు పరిరక్షణ, వాటి పురోగతి తదితర ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు.

## పాథమిక హక్కులకు భంగం: జగన్

అమరావతి,జులై 12: ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని, సమాధానం నుంచి కోరుకునే అవకాశం ఉండాలని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఏపీలో ప్రజాస్వామ్య ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని అన్నారు. ఏపీలో జరుగుతున్న అణచివేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారంటూ ట్వీట్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నిరంకుశ పాలనలో అడ్డగోలుగా అణచివేయపడుతోందని, పోలీసులతో అధికార దుర్వినియోగం చేయిస్తూ, అసమ్మతి గళాలను నులిమేస్తున్నారని మండిపడ్డారు. గుంటూరు మిర్చియార్డులో.. పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్తే మూడు కేసులు పెట్టి 15 మందిని అరెస్టు చేశారని, పల్నాడులో పోలీస్ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న ఎమ్మెల్యే నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తే 5 కేసులు, 131 మందికి నోటీసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా పోస్టర్ ప్రదర్శించిన యువకుడిని జైల్లో పెట్టారని, బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించడానిక వెళ్తే ఇష్టం వచ్చినట్టుగా వైసీపీ కేడర్‌ను అక్రమంగా ఇరికిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాన్ని బెదిరించి, అణచివేయాలని చూస్తోందని, ఇందుకోసం పోలీసు వ్యవస్థను వాడుకోవటం సరికాదు అని జగన్ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర

## టీటీడీపై బండి సంజయ్ వ్యాఖ్యలు అబద్ధం.. మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి,జులై 12: టీటీడీలో వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు ఉన్నారంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తప్పుబట్టారు. వెయ్యిమంది అన్యమతస్థులు ఉన్నారని అనడం అబద్ధమని అన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యల వెనుక తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. టీటీడీ లెక్కల ప్రకారమే 20 మంది ఉన్నారని తెలిపారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో ఉన్న వెయ్యి మంది అన్యమత ఉద్యోగస్తులను తొలగించాలని బండి సంజయ్ హెచ్చరించారని.. పూర్వ అధ్యక్షుడిగా బండి సంజయ్ వ్యాఖ్యలను తాను ఆక్షేపిస్తున్నట్లు తెలిపారు. బండి సంజయ్ కామెంట్స్ శ్రీవారి ఆలయంపై దాడిలా ఉందని మండిపడ్డారు. దర్శనానికి వచ్చి దర్శనం



చేసుకుని పోకుండా.. ఇంత పెద్ద బండ టీటీడీపై వేయటం సబబుగా లేదన్నారు. టీటీడీలో 22 మంది అన్యమత ఉద్యోగులను గుర్తించామని ఆరు నెలల క్రితం టీటీడీ బోర్డు ప్రకటించిందని.. కానీ ఇప్పుడు బండి సంజయ్ మాత్రం వెయ్యి మందికిపైగా ఉన్నారని చెబుతున్నారని భూమన అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన వద్ద ఆధారాలు ఉంటే తెలపాలని సవాల్ చేశారు. దాదాపు 20 శాతం మంది అన్యమత ఉద్యోగులు టీటీడీలో ఉన్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యల సారాంశమని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం బండి సంజయ్ వ్యాఖ్యలను సమర్థిస్తుందా? అని ప్రశ్నించారు. బండి సంజయ్ హెచ్చరిక చేసి 24 గంటలు అయ్యిందని.. ఇప్పటి దాకా టీటీడీ చైర్మన్, ఈఓ, ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీన్ని ఖండించలేదన్నారు. వీరంతా బండి సంజయ్‌కి లొంగిపోయారా? ఆయన చెప్పింది నిజమని సమర్థిస్తున్నారా? అని నిలదీశారు. కేంద్ర మంత్రి ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. పాలక మండలిని, టీటీడీ ఉద్యోగులను తీవ్రంగా అవమాన పరిచేలా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సోషల్ వాణి



### పవన్ కళ్యాణ్ గారికి సూటి ప్రశ్న

రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగినది
తెలుగు భాష. కేవలం 700 సంవత్సరాల చరిత్ర కలిగినది
హిందీ భాష. హిందీ భాష పెద్దమ్మ ఎలా అవుతుంది?
ఆ స్థాయిలో ఉండి కనీసం చరిత్ర తెలుసుకోరా?

– ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి

## హత్యకేసులో జనసేన నేత

### శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ వినుత సస్పెన్షన్

శ్రీకాళహస్తి,జులై 12: జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వినుతను ఆ పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ మేరకు మీడియాకు జనసేన అధిష్టానం శనివారం లేఖ విడుదల చేసింది. వినుత వ్యవహార శైలి జనసేన విధివిధానాలకి భిన్నంగా ఉండటంతో ఆమెని గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకి దూరంగా ఉంచినట్లు జనసేన హై కమాండ్ తెలిపింది. ఆమెపై చెన్నైలో జరిగిన ఓ హత్య కేసు ఆరోపణలు పార్టీ దృష్టికి వచ్చాయని గుర్తుచేసింది. ఈ క్రమంలో వినుత కోటను పార్టీ నుంచి బహిష్కరించామని జనసేన హై కమాండ్ ప్రకటించింది. కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు(24) చైన్నైలో దారుణ హత్యకి గురయ్యాడు. చెన్నై మిట్ రెడ్ హిల్స్ పరిసర ప్రాంతాల్లో రాయుడు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. వినుత డ్రైవర్ రాయుడు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి రాయుడు నానమ్మ వచ్చింది. ఆమెని పోలీసులు విచారణ చేశారు. మూడు నెలలుగా రాయుడుకు వినుత కుటుంబ సభ్యులతో విభేదాలు ఉన్నాయని తెలిపింది. రాయుడు మృతికి వినుత కుటుంబ సభ్యులే కారణమని అనుమానం వ్యక్తం చేశారు. రాయుడు నానమ్మ ఫిర్యాదు మేరకు వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు, వినుత తండ్రి భాస్కర్‌లని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు ఈ కేసుని ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఈ క్మంలో జనసన ఆమెను పార్టీనుంచి సస్పెండ్ చేసింది.

## సిట్ విచారణకు విజయసాయి డుమ్మా

అమరావతి,జూలై12: మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం సిట్ విచారణకు హాజరుకాలేదు. అయితే తాను విచారణకు రాలేనని సిట్ అధికారులకు ముందే సమాచారం ఇచ్చారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటం వలన రాలేకపోతున్నట్లు సమాచారం పంపారు. తాను రేపో మాపో విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒకసారి సిట్ ముందు విజయసాయి విచారణకు హాజరయ్యారు. అయితే ఈ రోజు సిట్ ముందుకు విజయసాయి రావాల్సి ఉండగా.. అంతుముందే ఎక్స్‌లో ఆయన ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఎవరైతే కర్మను చేస్తారో వారు అనుభవించక తప్పదు అనే విధంగా భగవద్గీతకు సంబంధించి ఓ శ్లోకాన్ని ఆయన పోస్టు చేశారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్18న విజయసాయినితొలిసారి సిట్ అధికారులు ప్రశ్నించారు.



# కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్ కారుపై దాడి

### బీసీ మహిళపై పాశవిక దాడి: జగన్

గుడివాడ, జూలై 12 (ఈవార్తలు): ఏపీలోని కృష్ణా జిల్లాలోని గుడివాడలో కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారుపై దాడి జరిగింది. టీడీపీ, జనసేన గూండాలే ఈ దాడి చేశారని బాధితురాలు వెల్లడించారు. (మహిళ అని చూడకుండా దాడికి పాల్పడ్డాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తూ ఉండిపోయారు. వాళ్ళ దాడి చేసుకుంటారు. మనకెందుకులె అన్న చందంగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ సమావేశానికి వెళుతున్న దారిలోనే ప్రభుత్వ సమావేశం జరుగుతుంది. వైఎస్సార్‌సీపీ సమావేశానికి వెళ్లకుండా చేసేందుకు కర్రలు, రాళ్లతో దాడికి దిగారు' అని బాధితురాలు వెల్లడించారు.

### భయంతో కారులోంచి బయటకు రాలేదు

తనను టార్గెట్ చేసే టీడీపీ, జనసేన గూండాలు దాడికి పాల్పడ్డారని కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కన్నీటి పర్యంతమయ్యారు. గుడివాడ ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందన్నారు. కారులో ఉన్న తమను చంపడానికి యత్నించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడితో భయపడిపోయి తన భర్త, తాను కారులోంచి బయటకు రాలేదన్నారు. తనను అసభ్య పదజాలంతో దూషించారని, తన కారు అద్దాలను ధ్వంసం చేశారన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని ఆమె తెలిపారు. టీడీపీ గూండాలు తన కారుపై దాడి చేస్తున్నా పోలీసులు పట్టించుకోకుండా వారికి సహకరించినట్లు వ్యవహరించారన్నారు.

### ఉప్పాల హారికకు ఫోన్‌లో జగన్ పరామర్శ

ఉప్పాల హారికను జగన్ ఫోన్‌లో పరామర్శించారు. ఆమెతో మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్న వైఎస్ జగన్.. బీసీ మహిళపై జరిగిన పాశవిక దాడిని ఆయన ఖండించారు. టీడీపీ, జనసేన మూకలు దాడి చేసిన విషయం పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఒక బీసీ మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలు భయంతో వణికిపోయే పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయంటే ఇంతకంటే దారుణం ఉంటుందా? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ప్రజాస్వామ్య హననం జరుగుతోందని, ఆటవిక పాలన సాగుతోందని మండిపడ్డారు. హారిక ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.



## 31.50 మీటర్లకు పోలవరం నీటిమట్టం

మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు తెలంగాణలోని భద్రాచలం వద్ద రెండు రోజులుగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద భారీగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద శనివారం సాయంత్రానికి నీటి మట్టం 31.50 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 7.50 లక్షల క్యూసెక్కుల నీరు స్పిల్ ఛానల్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తోంది. గోదావరి మధ్యలో ఉన్న భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయ కొండ మెట్ల వరకు నీరు చేరింది. పట్టిసీమ రేవులో వరద గోదారమ్మను వీక్షించేందుకు స్థానికులతో పాటు సందర్శకులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. వరద తీవ్రత దృష్ట్యా పోలవరం, పురుషోత్తపట్నం మధ్య తిరిగే రేవులాంచీ రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

# మొబైల్ ఫోన్ చోరీ..



## భార్య వివాహేతర సంబంధం బట్టబయలు

న్యూఢిల్లీ: ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగతనం చేయటంతో అతడి భార్య వివాహేతర సంబంధం బట్టబయలైన సంఘటన ఢిల్లీలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. జూన్ 19న దక్షిణ ఢిల్లీలోని ఓల్డ్ యూకే పెయింట్ ఫ్యాక్టరీ సమీపంలో స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక వ్యక్తి మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ ప్రాంతంలోని 70 సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. స్కూటీ నంబర్ తెలుసుకున్నారు. దర్యాగంజ్‌లో రెంట్‌కు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్ ఆధారంగా ఆ స్కూటీని అద్దెకు తీసుకున్న వ్యక్తిని రాజస్థాన్‌లోని బార్మర్ జిల్లా బలోత్రాకు చెందిన అంకిత్ గెహ్లాట్‌గా గుర్తించి అరెస్టు చేశారు. అతడిని పట్టుకొని ప్రశ్నించగా.. ఆ వ్యక్తి భార్యే మొబైల్ చోరీ కోసం తనను మాట్లాడుకుందని వెల్లడించాడు. ఆమెకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నదని చెప్పాడు. ఇది తెలిసిన భర్త.. ఆమె మొబైల్‌లోని ఫొటోలను తన మొబైల్ ఫోన్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు వివరించాడు. దీంతో ఆమె ఆ ఫోన్‌ను చోరీ చేయించిందని తెలిపాడు. భర్త మొబైల్ ఫోన్ చోరీ చేయించి అందులో ఉన్న ఆ ఫొటోలు డిలీట్ చేయించేందుకు భార్యే ఈ ప్లాన్ వేసిందని పోలీసులు తెలిపారు. దొంగతో పాటు నిందితురాలిని అరెస్టు చేశామని వెల్లడించారు.

# విడాకుల సంతోషం..



## 40 లీటర్ల పాలతో స్నానం

న్యూఢిల్లీ: విడాకులు వచ్చిన ఆనందంలో 40 లీటర్ల పాలతో స్నానం చేశాడో భర్త. అసోంలోని నల్బరి జిల్లా ముకల్మువా పోలీస్ స్టేషన్ పరిధిలోని బరలియాప్ గ్రామానికి చెందిన మాణిక్ అలీ తన భార్యతో విడాకులు తీసుకున్న సంతోషంతో నాలుగు బకెట్ల నీటితో స్నానం చేశాడు. తనకు ఇప్పుడు ప్రశాంతంగా ఉందని పేర్కొన్నాడు. తన భార్య మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, రెండు సార్లు ప్రియుడితో పారిపోయిందని, రెండుసార్లు పిల్లల కోసం క్షమించి వదిలేశానని, కానీ తన భార్య పదే పదే తన ప్రియుడితో పారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. చివరికి భరించలేక చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నానని వెల్లడించాడు. దీంతో స్థానికులు మాణిక్‌పై జాలి చూపిస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది.

# విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

**విచారణకు పూర్తిగా సహకరిస్తామన్న బోయింగ్**

న్యూఢిల్లీ,జూలై12: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసిన క్రమంలో బోయింగ్ సంస్థ స్పందించింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ నివేదికపై బోయింగ్ సంస్థ స్పందించింది. విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని పేర్కొంది. అంతేకాదు బాధితులకు అండగా ఉంటామని వెల్లడించింది. 'ఎయిర్ ఇండియా విమానం171 ప్రమాదంలో మరణించిన ప్రయాణికులు, సిబ్బంది చుట్టూనే మా ఆలోచనలు తిరుగుతున్నాయి. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రొటోకాల్ ప్రకారం.. ఏఐ171కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని



ఏఏఐబీకి అందించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొంది. ఈ మేరకు బోయింగ్ ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది.

# వచ్చే వారం చైనాకు జైశంకర్

## ఐదేళ్ల తర్వాత డ్రాగన్ కంట్రీకి.. సానుకూల సంబంధాల కోసమే

న్యూఢిల్లీ: భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వచ్చే వారం చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఐదేళ్ల తర్వాత ఆయన చైనాలో పర్యటించనున్నారు. ఇటీవల చైనాలో జరిగిన రక్షణ మంత్రుల సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఇది జరిగిన మూడు వారాల తర్వాత చైనాలో జైశంకర్ పర్యటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ)వెంబడి 2020 నాటి సైనిక ప్రతిష్టంభన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పర్యటనలో జైశంకర్ షాంఘై సహకార సంస్థ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొననున్నారు. దీనికి ముందు ఆయన బీజింగ్‌లో చైనా ప్రతినిధి వాంగ్ యితో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. కాగా సరిహద్దు వివాదంపై భారతదేశ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో చర్చలు జరిపేందుకు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి త్వరలో భారతదేశాన్ని సందర్శించనున్నారని వార్తా సంస్థ పీటీఐ గతంలో తెలిపింది. ఇరు దేశాలు తమ మధ్య దెబ్బతిన్న సంబంధాలను సరిదిద్దుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. భారత్- చైనా సంబంధాలు సానుకూల దిశగా పయనిస్తున్నాయని జైశంకర్ ఇటీవల అన్నారు. ఈ పర్యటనలో జైశంకర్..



సరిహద్దు వివాదాలు, దలైలామా వారసత్వం, భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతలు, రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాల పునఃప్రారంభం తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం. 2020 మే నెలలో గాల్వన్ లోయలో జరిగిన ఘర్షణ ఇరు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసింది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత గత నెలలో ఇరు దేశాలు కైలాస మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభించాయి.

# 50 మంది పాక్ సైనికులు హతం

- **3 రోజుల పాటు బలూచ్ ఆర్మీ ఆపరేషన్**
- **84 సైనిక స్థావరాలపై భీకర దాడులు**
- **దాడుల్లో 9 మంది నిఘా ఏజెంట్లు మృతి**

ఇస్లామాబాద్: బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 50 మంది పాకిస్థాన్ సైనికులు మృతి చెందారు. జూలై 9 నుంచి 11వ తేదీ వరకు మొత్తం 84 పాక్ ఆర్మీ స్థావరాలపై చేపట్టిన దాడుల్లో.. మరో 50 మంది సైనికులు గాయపడ్డారు. ఈ దాడుల్లో నిఘా సంస్థలకు చెందిన 9 మంది ఏజెంట్లు మరణించారు. మరోవైపు, 7 మొబైల్ టవర్లను, పాక్ ఆర్మీకి చెందిన యుద్ధ యంత్రాలను ధ్వంసం చేశారు. 24 మైనింగ్ ట్రక్కులు, గ్యాస్ ట్యాంకర్లు నాశనం చేశారు. ఐదు కంటే ఎక్కువ నిఘా డ్రోన్లు, క్వాడ్‌కాప్టర్లను కాల్చివేశారు. కాగా, మక్రాన్, రేఖ్షాన్, కోల్వా, సరవాన్, ఝలావన్, కో-ఎ-సులైమాన్, బేలా, కచ్చివంటి ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. ఈ దాడిపై బలూచ్ ఆర్మీ స్పందిస్తూ.. 'పాక్ బలహీనమైనదని.. బలూచ్ ప్రజలను ఎట్టి పరిస్థితుల్లో అణచివేయలేరు. పాక్ నిఘా వ్యవస్థ దెబ్బతిన్నది' అని ప్రకటించింది.

## తొమ్మిది నెలలుగా ఇంట్లోనే శవంగా పాక్ నటి

కరాచీ: కరాచీలోని అపార్ట్‌మెంటులో చనిపోయిన పాక్ నటి హుమైరా అస్ఘర్ అలీ (32) 9 నెలల క్రితమే చనిపోయినట్లు తెలుస్తోంది. ఎముకలు బయటపడిన స్థితిలో ఆమె మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. లాహోర్‌కు చెందిన ఈమె ఏడేళ్ల క్రితం కరాచీకి వచ్చి, ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకొని ఉంటున్నారు. 2015లో గ్లామర్ పరిశ్రమలోకి అడుగుపెట్టిన హుమైరా పలు టెలివిజన్ షోల్లో కనిపించారు. జలేబీ (2015), లవ్ వ్యాక్సిన్ (2021) చిత్రాలు చేశారు. 2022లో వచ్చిన తమాషా రియాల్టీ షోతో పాపులరయ్యారు. కొన్ని నెలలుగా ఆమె అద్దె కట్టడం లేదని ఆ ఇంటి యజమాని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మరణించిన విషయం బయటపడింది. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా 9 నెలల క్రితమే ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చారు. చివరిసారిగా గతేడాది అక్టోబరులో ఆమెను చూశామని ఆ ఇంటికి దగ్గర్లో ఉంటున్నవారు చెప్పారని వెల్లడించారు. హుమైరా ఉంటున్న అంతస్తులో మరో ఫ్లాటు ఖాళీగా ఉండటంతో మృతదేహం నుంచి వచ్చిన దుర్వాసనను ఎవరూ పసిగట్టలేకపోయారు.

## బతికుండగానే శవపేటికలో ఊరేగింపు.. విందుభోజనం

బీజింగ్: ప్రాణాలతో ఉన్న తల్లిని ఓ వ్యక్తి శవపేటికలో ఊరేగించిన వింత ఘటన చైనాలో చోటుచేసుకుంది. హునాన్ ప్రావిన్స్‌కు చెందిన వ్యక్తి 70 ఏళ్ల వయసున్న తన తల్లి కోసం ఇటీవల ఓ శవపేటికను కొనుగోలు చేశాడు. శవపేటికను మోయడానికి 16 మందిని నియమించుకొని.. ఆమెను అందులో కూర్చోబెట్టి డప్పుచప్పుళ్లతో ఊరేగించాడు. అనంతరం ఇంటికి తీసుకెళ్లి అందరికీ విందు భోజనం పెట్టాడు. అయితే, చైనాలోని కొన్ని ప్రాంతాలలో ఎన్నో ఏళ్లుగా ఈ వింత సంప్రదాయాన్ని పాటిస్తారు. వృద్ధులను ఈ విధంగా శవపేటికల్లో ఊరేగించడాన్ని పిల్లలు, తల్లిదండ్రులపై చూపే ప్రేమకు చిహ్నంగా అక్కడి వారు భావిస్తారు. శవపేటికలో ఊరేగించడం వల్ల వృద్ధులు దీర్ఘాయుష్షుతో జీవిస్తారని అక్కడి ప్రజల విశ్వాసం. శవపేటికలను చైనాలో అదృష్టానికి చిహ్నంగా భావిస్తారు.




# 'ఆపరేషన్ శివ' నీడలో అమర్‌నాథ్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ తర్వాత అమర్‌నాథ్ యాత్ర జరుగుతుండటంతో కేంద్రం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. దీనికి ఆపరేషన్ శివ అని నామకరణం చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా.. అనంత్‌నాగ్‌లోని 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గామ్ మార్గం, గందర్‌బాల్‌లోని 14 కిలోమీటర్ల బాల్టాల్ మార్గాలు సైన్యం నిఘాలో ఉంటాయి. డ్రోన్ హెచ్చరికలను తటస్థీకరించడానికి 50 కంటే ఎక్కువ సీ-యూఏఎస్, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతో కూడిన కౌంటర్-మానవరహిత వైమానిక వ్యవస్థను సైన్యం ఏర్పాటు చేసింది. డ్రోన్లు, అధిక రిజల్యూషన్ పీటీజెడ్ కెమెరాలను ఉపయోగించి యాత్ర మార్గాలను అనుక్షణం పర్యవేక్షిస్తోంది. ముప్పు ఏర్పడినప్పుడు వేగవంతమైన ప్రతిస్పందనకు యాత్ర కాన్వాయ్‌ల రియల్ టైం ట్రాకింగ్‌ను అందుబాటులో ఉంచారు. ఇక, యాత్రికుల వైద్య మౌలిక సదుపాయాల కోసం 150 మందికి పైగా వైద్యులు, పారామెడిక్స్, రెండు అధునాతన డ్రెస్సింగ్ స్టేషన్లు, తొమ్మిది సహాయ పోస్టులు, 100 పడకల ఆస్పత్రి, రెండు లక్షల లీటర్ల ఆక్సిజన్‌తో కూడిన 26 ఆక్సిజన్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అత్యవసర లాజిస్టిక్స్‌లో బాంబు నిర్వీర్య బృందాలు, అవాంతరాలు లేని కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, సాంకేతిక సహాయ యూనిట్లు, 25,000 మందికి అత్యవసర రేషన్లు, బుల్డోజర్లు, ఎక్స్‌కవేటర్లు వంటి భారీ యంత్రాలను ఉంచారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ఆర్మీ హెలికాప్టర్లు స్టాండ్‌బైలో ఉంటాయి. ఇప్పటికే 1.4 లక్షలకు పైగా భక్తులు అమర్‌నాథ్‌ను దర్శించుకున్నారు. ఈ ఏడాది యాత్ర కోసం 4 లక్షలకుపైగా యాత్రికులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఈ యాత్ర ఆగస్టు 9తో ముగియనుంది.

## కాశ్మీర్‌లో లోయలో పడ్డ వాహనం.. ఐదుగురు వ్యక్తుల దుర్మరణం

శ్రీనగర్,జులై 12: జమ్ము కశ్మీర్ రాష్ట్రం రాంబన్ జిల్లాలో శనివారం ఉదయం వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో యావర్ అహ్మద్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. యుక్రల్ పోగల పరిస్తాన్ ప్రాంతంలోని సేనాబాతిలో రోడ్డుపక్కన ఉన్న 600 అడుగుల లోయలో పర్యాటకుల వాహనం పడింది. రెస్క్యూ సిబ్బంది, అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు లక్ష రూపాయలు, గాయపడిన 25 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతులు తౌఖర్ అహ్మద్, షకీల్ అహ్మద్, గాయపడిన వారు మహ్మద్ రఫీక్, అబ్దుల్ లతీఫ్, అజాజ్ అహ్మద్‌గా గుర్తించారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

# 600 డ్రోన్లతో రష్యా దాడి

**ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలు ధ్వంసం**

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్‌లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురు దాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జీఎంఎల్ఆర్ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.



# పెరుగు, ఉల్లి కలిపి తినొద్దు

పెరుగు ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలిసిందే. అయితే కొన్ని ఆహార పదార్థాలను పెరుగుతో కలిపి తినకూడదు. ప్రధానమైనది ఉల్లిపాయ. పెరుగు , ఉల్లి కలిపి తినకూడదు . ఇది ఆరోగ్యాన్ని అనేక విధాలుగా చెడుగా ప్రభావితం చేస్తుంది. ఉల్లిపాయలలోని సమ్మేళనాలు పెరిగిన ఆమ్లత స్థాయిలు గ్యాస్ ఉత్పత్తితో సంబంధం కలిగి ఉంటాయి. పెరుగు కూడా ఇదే ప్రభావాన్ని కలిగి ఉంటుంది. వాటిని కలపడం గ్యాస్ట్రిక్ అసౌకర్యానికి దారితీస్తుంది. కొంతమందిలో, ఇది ఉబ్బరం, గ్యాస్ అజీర్ణం లక్షణాలను ప్రేరేపిస్తుంది. పెరుగు, ఉల్లిపాయల వైరుధ్య స్వభావం భిన్నంగా ఉంటుంది. ఒకటి బాడీ శీతలీకరణ పదార్థం. మరొకటి శరీరాన్ని వేడి చేసే పదార్థం. వాటి కలయిక శరీర ఉష్ణోగ్రత నియంత్రణ యంత్రాంగంలో సమస్యలను కలిగిస్తుంది. ఇది శరీర ఉష్ణోగ్రత పెరుగుదల, చర్మపు దద్దుర్లు, తామర, సోరియాసిస్ ఇతర చర్మ అలెర్జీలకు కారణమవుతుంది. పాలను పులియబెట్టడం ద్వారా పెరుగును తయారు చేస్తారు. ప్రోబయోటిక్స్ లాక్టోస్‌ను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి దానిలో కొన్ని ఇతర భాగాలను కలిగి ఉంటాయి. ఉల్లిపాయ, సల్ఫర్ ఫైబర్ సమ్మేళనాలతో కూడిన కూరగాయలు, కిణ్వ ప్రక్రియ ప్రక్రియలో జోక్యం చేసుకోవచ్చు. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. పెరుగుతో ఉల్లిపాయలను జత చేయడం వల్ల కలిగే అసమతుల్యత శరీరంలో అధిక వేడిని సృష్టిస్తుంది. ఇది శరీరంపై దద్దుర్లు, తామర కొన్ని సందర్భాల్లో సోరియాసిస్‌తో సహా చర్మ అలెర్జీలకు కారణమవుతుంది. ఒక్కోసారి ఫుడ్ అలర్జీకి కూడా కారణం కావచ్చు. పెరుగు కోసం వేయించిన ఉల్లిపాయలను ఉపయోగించడం వల్ల అనారోగ్య సమస్యలను నివారించవచ్చు. ఉల్లిపాయలను వేయించడం వల్ల వాటి రియాక్టివ్ పవర్ తగ్గుతుంది. ఇది దానిలోని సల్ఫర్ స్థాయిని తగ్గిస్తుంది. ఉల్లిపాయలు వేగిన తర్వాత కాసేపు అలాగే ఉంచి పెరుగులో వేయాలి. ఈ కలయిక రుచికరమైనది, ఆరోగ్యకరమైనది.



# ఆరోగ్యానికి నానబెట్టిన ఎండుద్రాక్షలు

ఎండుద్రాక్ష ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది పాలలో నానబెట్టి తింటారు. ఇది శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. రోజూ పాలలో నానబెట్టిన ఎండుద్రాక్ష తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. విటమిన్ సి, ఇ, కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు ఎండుద్రాక్షలో ఉంటాయి. అలాగే పాలలో ప్రొటీన్లు ఉంటాయి. పాలలో క్యాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. అటువంటి పరిస్థితిలో, ప్రతిరోజూ ఎండుద్రాక్షను పాలతో కలిపి తీసుకోవడం వల్ల అపారమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఎండు ద్రాక్షను పాలలో కలిపి తింటే ఎముకలు బలపడతాయి. అలాగే ఎముకలకు సంబంధించిన ఏదైనా సమస్య ఉంటే పాలు, ఎండు ద్రాక్షలను కలిపి తింటే దూరం అవుతుంది. సన్నగా ఉన్నవారు బరువు పెరగాలంటే పాలు, ఎండుద్రాక్ష తినండి. ఎండుద్రాక్ష కలిపిన పాలు తాగడం వల్ల బరువు పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి, మంచి గుండె ఆరోగ్యాన్ని కలిగి ఉండటం చాలా ముఖ్యం. రోజూ పాలలో ఎండుద్రాక్షను కలిపి తింటే గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఎండుద్రాక్షలో ఫైబర్, పొటాషియం ఉంటాయి, ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక నిర్దిష్ట వయస్సు తర్వాత, శరీరంలో రక్తంలో లోపం ఏర్పడుతుంది. దీని కారణంగా, ప్రజలు తరచుగా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. అదనంగా, హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడం ప్రారంభమవుతుంది. అటువంటి పరిస్థితిలో ఎండుద్రాక్ష మరియు పాలు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. రోజూ పాలతో ఎండుద్రాక్ష తినడం వల్ల చర్మం మరియు జుట్టుకు కూడా మేలు జరుగుతుంది. ఎండు ద్రాక్షను పాలలో కలిపి తింటే చర్మం మెరుగవుతుంది. ఇది ప్రొటీన్‌ని అందిస్తుంది. జుట్టు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. కాబట్టి, ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మీ చర్మం మరియు జుట్టు యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మీరు పాలు మరియు ఎండుద్రాక్షలను కలిపి తినవచ్చు.

వయ్యారి చిత్రం



# కోట శ్రీనివాసరావు కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. 1942 జులై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో కోట శ్రీనివాసరావు జన్మించారు. 1968లో రుక్మిణిని వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కోట శ్రీనివాసరావు కుమారుడు కోట ప్రసాద్ 2010 జూన్ 21న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సినిమాల్లోకి రాక ముందు కోట శ్రీనివాసరావు స్టేట్ బ్యాంకులో పనిచేశారు. తమిళం, హిందీ, కన్నడ చిత్రాల్లో కూడా నటించారు. తొమ్మిది నంది పురస్కారాలు అందుకున్నారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 1999-2004 వరకు విజయవాడ తూర్పు నియోజకర్గ బీజేపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. మొత్తం 750కి పైగా చిత్రాల్లో నటించారు.



## వైఎస్, చంద్రబాబుపై దేవకట్టా వెబ్ సిరీస్

ఉమ్మడి ఏపీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబునాయుడుపై ఒక వెబ్ సిరీస్ రాబోతుంది. వీరిద్దరి మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌ని ఆధారంగా 1990లో ఉన్న ఆంధ్రా రాజకీయాలపై ప్రముఖ దర్శకుడు దేవకట్టా 'మయసభ' అనే వెబ్ సిరీస్ తెరకెక్కిస్తున్నాడు. ఇందులో ఆది పినిశెట్టి చంద్రబాబు నాయుడి పాత్రలో నటిస్తుండగా.. కీడాకోలా సినిమాతో అలరించిన చైతన్య రావు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర పోషిస్తున్నాడు. ప్రముఖ ఓటీటీ వేదిక సోని లివ్‌లో ఈ వెబ్ సిరీస్ ఆగస్టు 7 నుంచి స్ట్రీమింగ్‌లోకి రాబోతుండగా.. తాజాగా దీనికి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే.. ఎన్టీఆర్‌ని ఎదిరించి ఎమ్మెల్యేలందరినీ హోటల్‌కి రప్పించుకున్న చంద్రబాబు.. వైఎస్‌కి ఫోన్ చేసి నీ సహాయం కావాలని కోరడం చూడవచ్చు. చంద్రబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు యూత్ కాంగ్రెస్‌లో కీలక పాత్రలను పోషించారు. అయితే వీరిద్దరు కాలేజ్‌లో ఉన్న సమయంలో వాళ్ల ఫ్రెండ్‌షిప్ ఎలా ఉంది? రాజకీయల్లోకి వచ్చాక ఎలా మారింది? అనే విషయాలపై వెబ్ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు దేవకట్టా.

## నాలుగు పాత్రల్లో అల్లు అర్జున్



తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ ఏకంగా నాలుగు పాత్రల్లో కనిపించబోతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వార్తలు అటు సోషల్ మీడియాతో పాటు ఇటు బీ టౌన్‌లో చక్కర్లు కొడుతున్నాయి. తాతగా, తండ్రిగా, ఇద్దరు కొడుకులుగా అల్లు అర్జున్ కనిపించనున్నారని సమాచారం. దర్శకుడు అట్లీ మొదట అల్లు అర్జున్‌ని రెండు పాత్రల కోసం, మిగిలిన రెండు పాత్రలకు ఇతర నటులను తీసుకోవాలని అనుకున్నారట. అయితే అల్లు అర్జునే స్వయంగా ఈ నాలుగు పాత్రలను చేయడానికి ఇంట్రెస్ట్ చూపించడంతో అట్లీ ఒకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ నాలుగు పాత్రలకు సంబంధించి అల్లు అర్జున్‌పై లుక్ టెస్టులు నిర్వహించగా అవి అద్భుతంగా వచ్చినట్లు సమాచారం. ఈ సినిమా ఒక సైన్స్ ఫిక్షన్ కథాంశంతో, పునర్జన్మల కాన్సెప్ట్‌తో రాబోతుందని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌లో దీపిక పడుకోన్ భాగం అవ్వగా.. రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా నటిస్తారని ప్రచారం జరుగుతోంది.



## లెనిన్ నుంచి శ్రీలీల ఔట్

అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం లెనిన్. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్ షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పుడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ చిత్రీకరించబోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు.. సమాచారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.

## ఏఐ ఆధారంగా భగవద్గీత



ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే అదిపురుష్, శాకుంతలం, హనుమాన్ లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి రామాయణ కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. వర్చువల్ రియాలిటీ ద్వారా మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.




## పెద్ది నుంచి గౌరినాయుడు లుక్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం పెద్ది. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని.. వెంకట సతీష్ కిలారు నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజువల్ పరంగా సినిమాకి ప్రత్యేకంగా నిలిచేలా ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంగీతానికి ఎ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్స్‌తో సినిమాపై అంచనాలు కూడా భాగా పెరిగిపోయ్యాయి. అయితే తాజాగా చిత్రబృదం నేడు సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా, ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను పెద్ది చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదలైన శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్ సినిమాలోని అతని పాత్ర ఎంత బలమైనదో చూపించింది. మందపాటి హ్యాండిల్ బార్ మీసం, గంభీరమైన చూపుతో.. శివరాజ్ కుమార్ లుక్ అదిరిపోయింది. కాగా ఈ మూవీలో ఆయన గౌరినాయుడు పాత్రలో కనిపించనున్నారు.




## రాను బొంబాయికి రాను.. కోటి కొల్లగొట్టారు!

తెలంగాణ పల్లె పాటలు యూట్యూబ్‌తో పాటు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో దూసుకుపోతున్నాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది రాను బొంబాయికి రాను అనే పాట. జనవరి 23న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ఆల్బమ్ ఇప్పటివరకు 400 మిలియన్స్ వ్యూస్ అందుకుంది. రూ.3 లక్షల బడ్జెట్‌తో నిర్మించిన ఈ పాట యూట్యూబ్ ద్వారా దాదాపు రూ.1 కోటి ఆదాయం పొందినట్లు సమాచారం. రాబోయో రోజుల్లో కూడా ఈ పాట వ్యూస్‌ను బట్టి యూట్యూబ్ ద్వారా మరింత ఆదాయం రానుంది. ఈ పాటను రాము రాథోడ్ రాయగా.. కల్యాణ్ కీస్ సంగీతం అందించారు. ప్రభ, రాము కలిసి పాడారు. ముందుగా ఈ పాటను వేములవాడలో చిత్రీకరించారు. క్లైమాక్స్‌ను మరింత బాగా చూపించేందుకు జగిత్యాలలో తిరిగి షూట్ చేసింది.



# మీరు అడిగిన ప్రశ్న నేను మర్చిపోయా: బుమ్రా

లార్డ్స్ మైదానం వేదికగా భారత్ – ఇంగ్లాండ్ మధ్య టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌటైంది. టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ ఇన్నింగ్స్‌లో రఫ్ఫాడించాడు. ఏకంగా ఐదు వికెట్లు నేలకూల్చి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ఇక రెండో రోజు అనంతరం బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు.రెండో రోజు ఆట ముగిసిన తర్వాత టీమ్ఇండియా తరపున బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యాడు.అయితే భద్రతా కారణాల దృష్ట్యా జర్నలిస్టుల ఫోన్లు అక్కడే టేబుల్‌పై ఉంచుతారు. ఇక బుమ్రా మీడియాతో క్వొశ్చన్ ఆండ్ అన్సర్ సెషన్‌లో పాల్గొన్నాడు. అయితే మీడియాకు సమాధానం చెబుతున్న టైమ్‌లో సడెన్‌గా ఓ రిపోర్టర్ ఫోన్ రింగ్ అయ్యింది.వెంటనే బుమ్రా ఓ ఫోన్ వైపునకు చూస్తూ 'ఎవరి భార్యో ఫోన్ చేస్తోంది. కానీ నేను ఈ ఫోన్ ఎత్తను' అని సరదాగా అన్నాడు. దీని తర్వాత బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలనుకున్నాడు. కానీ 'మీరు అడిగి ప్రశ్న నేను మర్చిపోయా, మీరు ఏమి అడిగారు' అని నవ్వుతూ అన్నాడు. దీంతో సీరియస్ ప్రెస్ కాన్ఫరెన్స్ కాస్త ఒక్కసారిగా ఫన్నీగా మారిపోయింది. అక్కడున్న రిపోర్టర్లు నవ్వుకున్నారు.కాగా, తొలి రోజు ఒకే వికెట్ దక్కించుకున్న బుమ్రా, రెండో రోజు ప్రమాదకరంగా మారాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే రెండు కీలక వికెట్లు స్టోక్స్, రూట్‌ను పెవిలియన్‌కు పంపి టీమ్ఇండియాను గేమ్‌లోకి తీసుకొచ్చాడు. కాసేపటికే డేంజరస్ హ్యారీ బ్రూక్ (11)ను సూపర్ బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక లంచ్ తర్వాత ఆర్చన్‌ను పెవిలియన్ చేర్చి ఐదో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు.భారత్ బ్యాటింగ్ ప్రారంభించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ 53 పరుగులతో, రిషబ్ పంత్ 19 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు కుప్పకూలింది. సీనియర్ బ్యాటర్ రూట్ (104 పరుగులు) సెంచరీ సాధించాడు. బ్రెండన్ కార్స్ (56) జెమీ స్మిత్ (51) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టీమ్ఇండియాలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. ఐదు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్ తలో 2, రవీంద్ర జడేజా 1 వికెట్ పడగొట్టారు.

# జో రూట్ ప్రపంచ రికార్డ్



## అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న జో రూట్

టెస్ట్ క్రికెట్ చరిత్రలో కేవలం నలుగురు ఆటగాళ్ళు మాత్రమే 200ం క్యాచ్‌లు తీసుకున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ ఇప్పుడు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. అది కూడా రాహుల్ ద్రవిడ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి.. నంబర్ వన్‌గా నిలిచాడు.లార్డ్స్ వేదికగా భారత్ తో జరిగిన 3వ టెస్ట్ మ్యాచ్ లో జో రూట్ టీమిండియా బ్యాట్స్ మన్ కరుణ్ నాయర్ ను క్యాచ్ తో పట్టుకున్నాడు. ఈ క్యాచ్ తో టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్ లు పట్టిన ఫీల్డర్ గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ పేరిట ఉండేది. 301 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేసిన ద్రవిడ్ మొత్తం 210 క్యాచ్‌లు పట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు జో రూట్ ఈ రికార్డును బద్దలు కొట్టడంలో విజయం సాధించాడు. జో రూట్ ఇప్పటివరకు 156 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, 296 ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేశాడు. ఈ సమయంలో, అతను తీసుకున్న క్యాచ్‌ల సంఖ్య సరిగ్గా 211వి. దీనితో, టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ప్రపంచ రికార్డు శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే పేరిట ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో 768 ఇన్నింగ్స్‌లలో (టీ20ంటెస్ట్ంవన్డే) ఫీల్డింగ్ చేసిన జయవర్ధనే మొత్తం 440 క్యాచ్‌లు పట్టడం ద్వారా ఈ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.

## కపిల్ దేవ్‌ను దాటేసిన బుమ్రా

లార్డ్స్ టెస్ట్‌లో జస్ప్రీత్ బుమ్రా భారత ఫాస్ట్ బౌలర్లకు ఇప్పటివరకు కలలో కూడా సాధ్యం కాని దాన్ని నిజం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్న బుమ్రా, మూడో టెస్ట్ రెండో రోజు ఉదయం బంతి పట్టుకోగానే ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లపై సునామీలా విరుచుకుపడ్డాడు. అతను ఈ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీయడమే కాకుండా దిగ్గజ బౌలర్ కపిల్ దేవ్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి, జస్ప్రీత్ బుమ్రా తన కెరీర్‌లో 15వ ఐదు వికెట్ల ఘనతను పూర్తి చేసుకున్నాడు. దీనిలో స్పెషాలిటీ ఏంటంటే.. ఇది విదేశీ గడ్డపై బుమ్రా 13సార్లు ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. దీంతో అతను కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టాడు. కపిల్ దేవ్ పేరు మీద 12 సార్లు ఐదు వికెట్లను తీసిన ఘనత సాధించిన రికార్డు ఉంది. ఇప్పుడు బుమ్రా విదేశీ గడ్డపై అత్యధిక సార్లు ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.విదేశీ గడ్డపై అత్యధిక ఐదు వికెట్ల ఘనతలు సాధించిన వారిలో జస్ప్రీత్ బుమ్రా టాప్ ప్లేసులో ఉన్నాడు. బుమ్రా తర్వాతి స్థానంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఉన్నాడు. అతను విదేశీ గడ్డపై 12 సార్లు ఐదు వికెట్లు తీశాడు. మూడో స్థానంలో భారత అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరైన అనిల్ కుంబ్లే నిలిచాడు.. తను 10 సార్లు ఈ ఫీట్‌ను నమోదు చేసుకున్నాడు. ఇక నాలుగో స్థానంలో టీమిండియా సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఉన్నాడు. అతను 9 సార్లు ఈ ఘనతను సాధించాడు.లార్డ్స్ మైదానంలో ఏదో ఒక రికార్డును తమ పేరు మీద నమోదు చేసుకోవాలని ప్రతి క్రికెటర్ కలలు కంటారు. కానీ బుమ్రా ఈ మైలురాయిని చేరుకున్న తర్వాత కూడా చాలా సైలెంటుగా కనిపించాడు. శుక్రవారం ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సందర్భంగా తన స్పెల్‌లో జోఫ్రా ఆర్చర్‌ను అవుట్ చేసి అతను ఐదు వికెట్లు పూర్తి చేసుకున్నాడు. అది బుమ్రాకు ఆ ఉదయం లభించిన నాలుగో వికెట్. తన అద్భుతమైన బౌలింగ్ సాయంతో భారత్ ఇంగ్లాండ్‌ను 387 పరుగులకే కట్టడి చేసింది.రెండో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ 4 వికెట్ల నష్టానికి 251 పరుగులతో ముందుకు సాగింది. జామీ స్మిత్, బ్రైడాన్ కార్స్ హాఫ్ సెంచరీలు సాధించారు. అయితే, ఆ తర్వాత ఇంగ్లాండ్ జట్టు భారత బౌలర్ల ముందు తడబడింది.

## సెంచరీతో రాహుల్ చరిత్ర

ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ దుమ్మురేపుతున్నాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్–సచిన్ ట్రోఫీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన రాహుల్.. 176 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో కీలక భాగస్వామ్యాలతో రాహుల్ జట్టును ఆదుకున్నాడు. అయితే సెంచరీ పూర్తయిన వెంటనే షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కరుణ్ నాయర్‌తో కలిసి రెండో వికెట్‌కు 61 పరుగులు జోడించిన రాహుల్.. రిషభ్ పంత్‌తో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.క్రికెట్ పుట్టిల్లు లార్డ్స్‌లో రాహుల్‌కు ఇది రెండో సెంచరీ. దాంతో ఓ అరుదైన రికార్డ్‌ను కేఎల్ రాహుల్ తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్‌ల్లో లార్డ్స్ వేదికగా రెండు శతకాలు నమోదు చేసిన తొలి ఆసియా ఓపెనర్‌గా నిలిచాడు. ఈ ఘనతను అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. రాహుల్ కంటే ముందు టీమిండియా దిగ్గజ క్రికెటర్ వెంగ్‌సర్కార్ లార్డ్స్ వేదికగా మూడు సెంచరీలు బాదాడు. లార్డ్స్ వేదికగా కేఎల్ రాహుల్ తన తొలి శతకాన్ని 2021లో నమోదు చేశాడు. ఆ మ్యాచ్‌లో టీమిండియా 151 పరుగుల తేడాతో విజయం సాధించింది. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు లార్డ్స్ వేదికగా సెంచరీ అందుకోలేకపోయారు. లార్డ్స్ మైదానంలో భారత్ నుంచి 10 మంది బ్యాటర్లు మాత్రమే సెంచరీలు నమోదు చేసి హానర్ బోర్డులో తమ పేరును లిఖించుకున్నారు.ఓవరాల్‌గా కేఎల్ రాహుల్‌కు ఇది 10వ టెస్ట్ సెంచరీ కాగా.. ఇంగ్లండ్ గడ్డపై నాలుగో టెస్ట్ శతకం. దాంతో ఇంగ్లండ్ గడ్డపై మూడు సెంచరీలు సాధించిన తొలి భారత ఓపెనర్‌గా రాహుల్ నిలిచాడు. గ్రేమ్ స్మిత్(5 సెంచరీలు) తర్వాత 2000 నుంచి ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సెంచరీలు బాదిన విదేశీ ఓపెనర్‌గా రికార్డ్ అందుకున్నాడు. రాహుల్ సాధించిన 10 టెస్ట్ సెంచరీల్లో 9 శతకాలు విదేశీ గడ్డపైనే నమోదు చేయడం గమనార్హం. ఇందులో ఇంగ్లండ్ గడ్డపై నాలుగు, దక్షిణాఫ్రికాలో రెండు, ఆస్ట్రేలియా, శ్రీలంక, వెస్టిండీస్‌లలో ఒక్కో సెంచరీలు ఉన్నాయి. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 5 ఇన్నింగ్స్‌లు ఆడిన రాహుల్ 42, 137,2, 55, 100 పరుగులతో రాణించాడు.



# టీ20 ప్రపంచకప్‌కు ఇటలీ అర్హత

టీ20 క్రికెట్ పరిచయం తర్వాత ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రజాదరణ పొందుతోంది. మూడు గంటల్లోనే మ్యాచ్ ఉత్సాహంగా ముగుస్తుంది. కాబట్టి అనేక యూరోపియన్ దేశాలు క్రికెట్ ఆడేందుకు ఆసక్తిని చూపుతున్నాయి. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఇటలీ మొదటిసారిగా అర్హత సాధించింది. దీని ద్వారా ఇప్పటివరకు క్రికెట్ వైపు చూడని యూరోపియన్ దేశాలలో ఇటలీ అర్హత సాధించడం ఒక ప్రత్యేకత. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ కోసం యూరోపియన్ ప్రాంతీయ క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఇటలీ, నెదర్లాండ్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇటలీ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని నెదర్లాండ్స్ జట్టు 16.2 ఓవర్లలో ఛేదించింది. దీని ద్వారా నెదర్లాండ్స్ జట్టు టీ20 ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. నెదర్లాండ్స్ జట్టుపై ఇటలీ ఓడినప్పటికీ.. గ్రూప్‌లో 4 మ్యాచ్ లు ఆడిన ఇటలీ 2 విజయాలు, ఒక పరాజయం, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 5 పాయింట్లు ఖాతాలో వేసుకుని పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా ముందంజ వేసింది.పాయింట్ల పట్టికలో స్కాట్లాండ్ జట్టుతో పోలిస్తే అధిక రన్ రేట్ సాధించిన ఇటలీ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించింది. ఇదిలా ఉండగా.. గత 4 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్లలో స్థానం సంపాదించిన స్కాట్లాండ్ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించకుండానే నిష్క్రమించింది. మొత్తం 20 జట్లు 2026 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఆడనున్నాయి. ప్రస్తుతం వరకు 15 జట్లు అర్హత సాధించాయి. ఇంకా ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ టోర్నమెంట్ నుంచి 3 జట్లు, ఆఫ్రికా క్వాలిఫయర్ ద్వారా రెండు జట్లు ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నాయి.ఈ నేపథ్యంలో మాజీ ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెట్ ఆటగాడు జో బర్న్స్ ప్రస్తుతం ఇటలీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ సమయంలో పాకిస్థాన్ అమెరికా జట్టుతో ఓడిపోయిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఇటలీ జట్టు ప్రపంచ కప్ టీ20 టోర్నమెంట్‌లో ఆడనున్నందున పాకిస్తాన్ జట్టు జాగ్రత్తగా ఉండాలని భారత అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.

## రెండో రోజు బంతి మార్పుపై వివాదం

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ చాలా చర్చనీయాంశంగా మారింది. రెండో రోజు బంతి మార్పుపై పెద్ద వివాదం చెలరేగింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్ల తర్వాత రూల్స్ ప్రకారం భారత్ కొత్త బంతిని అందుకుంది. అయితే 10 ఓవర్లు పూర్తయ్యేసరికే బంతి ఆకారం దెబ్బతిన్నది. భారత ఆటగాళ్ల ఫిర్యాదులో బంతిని పరిశీలించిన అంపైర్ మరో బాల్‌ను తెప్పించాడు. 10 ఓవర్లు మాత్రమే ఆడిన బాల్ తీసుకొచ్చాడు. అయితే ఈ బంతి పాతదానికి కంటే మరి ఘోరంగా ఉండటంతో భారత ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదే విషయాన్ని అంపైర్‌కు చెప్పే ప్రయత్నం చేయగా.. అతను వినిపించుకోలేదు. దాంతో మరింత అసహానానికి గురైన గిల్.. అంపైర్‌తో గొడవపడ్డాడు. ఇప్పుడు జో రూట్ దీనిపై స్పందించాడు.ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జో రూట్ బంతి మార్పుపై మాట్లాడాడు. టీమిండియా తీరుపై రూట్ ప్రశ్నలు లేవనెత్తాడు. డ్యూక్స్ బంతి మార్పుపై ఇంత చర్చ అవసరం లేదని జో రూట్ అభిప్రాయపడ్డాడు. జో రూట్ మాట్లాడుతూ.. "ఒక వేళ బంతి ఆకారం దెబ్బతింటే దానిని మార్చుకోవాలి. కానీ దీనిపై ఎటువంటి రాద్ధాంతం చేయకూడదు. ఇక్కడ ప్రపంచం అంతమైపోయిందని నేను అనుకోవడం లేదు. ఇది ఆటలో ఒక కొత్త మలుపు తీసుకువస్తుందని నేను భావిస్తున్నాను. మార్పులకు అనుగుణంగా మారే సామర్థ్యం మీకు ఉండాలి. దాని వల్ల స్వింగ్ ఆగిపోయినా లేదా మరింత పెరిగినా సరే రాణించే కెపాసిటీ ఉండాలి." అంటూ జో రూట్ అభిప్రాయపడ్డాడు.

# కీరన్ పొలార్డ్ సూపర్ ఇన్నింగ్స్

మేజర్ లీగ్ క్రికెట్ 2025 టోర్నమెంట్‌లో ఎంఐ న్యూయార్క్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఛాలెంజర్ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టును 7 వికెట్ల తేడాతో ఓడించి ఎంఐ న్యూయార్క్ రెండో సారి టైటిల్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. ముందుగా టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు బ్యాటింగ్ చేసింది. టెక్సాస్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 166 పరుగులు చేసింది. సూపర్ కింగ్స్ బ్యాటర్లలో కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్(42 బంతుల్లో 59 పరుగులు), అకీల్ హుస్సేన్(32 బంతుల్లో 55 పరుగులు), డొనొవాన్ ఫెరీరా(20 బంతుల్లో 32 పరుగులు) రాణించారు. ఈ ముగ్గురి ఇన్నింగ్స్ కారణంగా టెక్సాస్ సూపర్ కింగ్స్ 5 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేయగలిగింది. ఎంఐ న్యూయార్క్ బౌలర్లలో ట్రిస్టన్ లస్ 3 వికెట్లు పడగొట్టగా.. రిషిల్ ఉగార్కర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 167 పరుగుల లక్ష్యంలో న్యూయార్క్ జట్టు బరిలోకి దిగగా.. ఆరంభంలోనే క్వింటన్ డికాక్(6) రూపంలో కీలక వికెట్ ను కోల్పోయింది. వన్ డౌన్ బ్యాటర్ మైఖేల్ బ్రేస్ వెల్(8) కూడా పూర్తిగా విఫలమయ్యాడు. ఓపెనర్ మోనాంక్ పటేల్ 39 బంతుల్లో 49 పరుగులు చేశాడు. దీనితో పాటు నికోలస్ పూరన్ 36 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేశాడు. ఎంఐ న్యూయార్క్ స్టార్ బ్యాటర్ కీరన్ పొలార్డ్ దంచి కొట్టడంతో విజయం సొంతమైంది. పొలార్డ్ 22 బంతుల్లోనే 213.64 స్ట్రైక్ రేట్‌తో 47 పరుగులు చేశాడు. ఐపీఎల్ లాగే ఇప్పుడు మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో కూడా కీరన్ పొలార్డ్ సూపర్ కింగ్స్ ను ఓడించి జట్టుకు భారీ విజయాన్ని అందించి ఫైనల్‌కు చేర్చాడు. నికోలస్ పూరన్, కీరన్ పొలార్డ్ రెచ్చిపోవడంతో 19 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఎంఐ న్యూయార్క్ లక్ష్యాన్ని ఛేదించింది. టెక్సాస్ సూపర్ కింగ్స్ బౌలర్లలో అకీల్, జియా ఉల్ హక్, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.లీగ్ దశలో ఎంఐ న్యూయార్క్ ప్రదర్శన అంతగా ఆకట్టుకోనప్పటికీ.. వారు ఏదో విధంగా ప్లేఆఫ్స్‌కు చేరుకున్నారు. ఇప్పుడు వారు టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టును ఓడించి ఫైనల్‌కు చేరుకున్నారు. జులై 13న(సోమవారం) వేకువ జామున 5.30 గంటలకు వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుతో ఎంఐ న్యూయార్క్ జట్టు తలపడనుంది. వాషింగ్టన్ ప్రదర్శన మొదటి నుంచి బాగుంది. అందుకే ఫైనల్‌లో వారు గెలుపొందేందుకు ఫేవరేట్‌గా ఉన్నారు.




ఈవార్తలు
ప్రజావాణి
ఆదివారం 13-7-2025 | www.evarthalu.com



"..........వివేక వాణి.........."
ఏ పరిస్థితుల్లో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే, జరగాల్సిన పనులు అవే జరుగుతాయి.
- స్వామి వివేకానంద

ఒకరిది ఉనికి కోసం తండ్లాట..
ఒకరిది అధికారం కోసం తొండాట..
ఒకరిది అహంకారపు తిట్లాట..
ఒకరిది ఆధిపత్యపు కొట్లాట..
ఇప్పుడున్న పార్టీలవన్నీ అదే పాట..
ప్రజలకిక కావాలి కొత్త బాట..
ఆర్తనాదాలు కొత్త అండ కోసం..
జన నినాదాలు కొత్త జెండా కోసం..
రావాలి.. ప్రజల కోసం మరో పార్టీ!
ఇప్పుడున్న పార్టీలపై తప్పదు పోటీ!!




ఒకడు సవాల్ అంటాడు.. ఇంకొకడు ప్రతి సవాల్ విసురుతాడు. ఒకడు డేటు, ప్లేస్ ఫిక్స్ చెయ్యుమని బీరాలు పలుకుతాడు.. ఇంకొకడు పబ్బులు, క్లబ్బులు అంటూ నోటికొచ్చింది మాట్లాడుతాడు. రప్పా రప్పా రంకెలు.. అర్థం కాని బొంకులు. పనికిరాని పథకాలు.. ప్రతిఫలం అనుభవించాలి భవిష్యత్ తరాలు. ఒక విజన్ లేదు.. విమర్శలు తప్ప. ఒక అర్థవంతపు చర్చ లేదు.. ఆరోపణలు తప్ప. అలాంటి శూన్యమే నేడు తెలంగాణలో.. కొత్త పార్టీకి కావాల్సినంత జాగా. కొత్త పార్టీకి పలుకుతోంది తెలంగాణ స్వాగతం.. కోరుతోంది సామాజిక న్యాయం.

# కావాలి.. కొత్త పార్టీ



శ్రావణ వాణి

శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్
95812 91919

తెలంగాణలో ఏ పార్టీ చూసినా అంతర్గత కుమ్ములాటలే. దాని పర్యవసానంగా రాష్ట్రంలో రాజకీయ అగాథం ఏర్పడింది. రాష్ట్ర ప్రజానీకం ఏ పార్టీనీ నమ్మలేని స్థితిలో ఉన్నారు. ప్రజల సమస్యలు వినే నాయకుడు లేడు. ఉన్న నాయకులు అధికారం కోసం అర్రులు చాస్తున్నారు. వాళ్ల లొల్లి చూసి.. మన లొల్లేం పట్టించుకుంటాడులే అని ప్రజలు కూడా సమస్యలు చెప్పుకోవడం మానేశారు. ఒకప్పుడు ఒక ప్రజావ్యతిరేక నిర్ణయం తీసుకుంటే పార్టీలన్నీ కలిసి ప్రభుత్వంపై పోరాడేవి. అంతా ఏకమై పిడికిలి బిగించేవారు. కానీ.. నేడు సొంత పార్టీలోనే కాలు గుంజే ప్రబుద్ధులు ఉండటంతో ప్రతి నాయకుడిది అస్థిత్వపు ఆరాటమే అయిపోయింది.

తెలంగాణ నాడీని పట్టి పార్టీగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి.. విజయవంతంగా ఉద్యమాన్ని సాగించి స్వరాష్ట్రాన్ని సాధించింది. పదేళ్లు అధికారాన్ని అనుభవించింది. నేడు ప్రతిపక్షంలో చేరిన ఆ పార్టీ.. నేడు మాత్రం ప్రజల నాడీని పట్టలేకపోతోంది. ప్రజల సమస్యలపై పిడికిలి ఎత్తడం లేదు. ప్రెస్ నోట్లు.. ప్రెస్ మీట్లు.. ప్రాసల ట్వీట్లు.. తప్ప ఆ పార్టీ పొడిచిందేమీ లేదు. ప్రజల కోసం పోరాటం చేసిందేమీ లేదు. 18 నెలల పాలన కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను ఒడిసి పట్టలేకపోతోంది. అవసరం ఉన్నప్పుడు ఉద్యమాన్ని ఆకాశానికి ఎత్తి, అవసరం లేనప్పుడు అంతే గప్‌చుప్‌గా ఉండటం కేసీఆర్ స్టైల్. ఆ స్టైల్ ఉద్యమ పార్టీగా ఉన్నప్పుడు నడిచింది. కానీ, ఫక్తు రాజకీయ పార్టీగా మారినా అదే స్టైల్ కొనసాగిస్తానంటే కుదరదు. జనరేషన్ మారింది. జనం మారారు. అప్పటికి అంతే.. ఇప్పటికి ఇంతే అనే బాపతు. ఆ పాత స్టైల్ ఇప్పుడు అవుట్ డేటెడ్. ఆ విషయం రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌ని చూసిన తర్వాతైనా కేసీఆర్‌కు అర్థమై ఉండాలి. నిత్యం ఏదో ఒక వార్తతో ప్రజల్లో ఉండటం వల్లే వాళ్లకు నేడు దక్కిన అధికారం అనడంలో ఏ సంశయమూ లేదు. ప్రజల్లో తిరిగితేనే, ప్రజలను ఆదుకుంటేనే ఏదైనా దక్కేది. నిక్కచ్చిగా చెప్పాలంటే ప్రజలను అడుక్కుంటేనే అధికారం, అందలం. కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని బీఆర్ఎస్ అనుకోవడం భ్రమే అవుతుంది. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం వెతికే క్రమంలో బీఆర్ఎస్ లాస్ట్ ప్లేస్‌లోనే ఉంటుంది. దానికి కారణం బీఆర్ఎస్సే. ఓడిపోతే పోయి ఇంట్లో పడుకుంటా.. కాళేశ్వరంలో చిన్న పిల్లర్ కూలిపోతే ఇంత రాద్ధాంతమా.. వ్యాఖ్యలు ప్రజల అహాన్ని దెబ్బతీశాయి. ఆ వ్యాఖ్యలు ఇంకా ప్రజల చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి. రేవంత్ రెడ్డికి కాస్తో కూస్తో అదే ప్లస్. అందుకే కేసీఆర్‌ను ఎంత తిట్టినా ప్రజలు ఇంకా సైలెంట్‌గానే ఉంటున్నారు. కేటీఆర్, హరీశ్ రావు, కవిత, ఓ ఇద్దరు పెద్ద స్థాయి నేతలు తప్ప ఇంకెవరు మీడియాతో మాట్లాడినా ప్రజలు పట్టించుకోవడం లేదు. పార్టీ సంస్థాగత నిర్మాణలోపమే దీనికి కారణం. దాన్ని సరిదిద్దుతామని కేటీఆర్ ప్రకటించి 18 నెలలు గడిచినా, ఇప్పటికీ ఇంచు కూడా ముందుకు కదల్లేదు. కదిలే చాన్స్ కూడా లేదేమో. కుటుంబంలో ఆధిపత్య పోరు ఉంటే బయటి సమస్యలు తీర్చడం కష్టమే అవుతుంది.

బీజేపీ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అందివచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్న పార్టీ అది. బండి సంజయ్ లాంటి ఫైర్ బ్రాండ్ ఉండగా, కిషన్ రెడ్డిని తీసుకొచ్చి రాష్ట్ర అధ్యక్షుడిని చేశారు. ఆ ఫలితం ఏంటో అసెంబ్లీ ఎన్నికల్లో తెలిసిపోయింది. కర్ణాటకలో డీకే శివకుమార్, ఏపీలో పవన్ కల్యాణ్, తెలంగాణలో రేవంత్ రెడ్డి.. వీళ్లంతా ఫైర్ బ్రాండ్లే. వాళ్లే ఆయా పార్టీలకు అధికారాన్ని తెచ్చిపెట్టారు. బండి సంజయ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగానే కొనసాగి ఉంటే తెలంగాణలో బీజేపీ మరో స్థాయిలో ఉండేది. సరే.. ఇప్పటికైనా, పద్ధతి మార్చుకొని మళ్లీ గాడిలో పడిందా? అంటే అదీ లేదు. రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక బ్లండర్ మిస్టేక్. పార్టీలో మొదటి నుంచి ఉన్న నాయకుడు కాబట్టి రామచంద్రారావుకు బాధ్యతలు ఇవ్వడం కరెక్టే అని ఆ పార్టీవాళ్లు భావించి ఉండొచ్చు. కానీ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక ప్రభావం పార్టీలకు అతీతంగా ప్రజలపై పడుతుంది. ఆ నాయకుడు ఎలాంటి వాడు? సమస్యలను ఎలా అర్థం చేసుకోగలడు? ప్రభుత్వంపై ఏ స్థాయిలో పోరాడతాడు? అన్న కోణాల్లో ప్రజలు ఆలోచిస్తారు. హైదరాబాద్ వరకు రాంచందర్ రావు అంటే తెలుసు. కానీ, తెలంగాణ మారుమూల వరకు పార్టీని తీసుకెళ్లే సత్తా ఆయనకు లేదు. పైగా, అగ్ర కుల నాయకుడు అన్న ముద్ర వల్ల బీజేపీ నుంచి ప్రజలు దూరం జరగడం మనం చూడబోతున్నాం. ఆరెస్సెస్‌లో పెద్ద స్థాయిలో ఉండేవాళ్లంతా ఆ వర్గంవాళ్లే. వాళ్ల సిఫార్సు వల్లే రాంచందర్ రావుకు ఆ పదవి దక్కి ఉండొచ్చు. రాజాసింగ్ లాంటి నాయకుడిని దూరం చేసుకోవడం పార్టీకే కాదు.. హిందూత్వ భావజాలం కలిగిన అనేక మందికి మింగుడు పడటం లేదు. కాబట్టి అధికారం కట్టబెట్టే స్థాయిలో బీజేపీని ప్రజలు ఆదరిస్తారనుకోవడం శుద్ధ దండగ.

ఇక, అధికారంలో ఉన్న కాంగ్రెస్ గురించి కాస్త ఎక్కువే చెప్పుకోవాలి. ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ. ఇక్కడ ప్రజాస్వామ్యం అనే పదం వాడేకంటే ఎవరికి వారే తోపు అన్న పదం వాడటం బెటర్. అధికారంలోకి వచ్చిందన్న సంబురమే గానీ, ఏ నాయకుడు ఏం మాట్లాడతాడో అర్థం కాదు. తమ శాఖలపై ఆయా మంత్రులకు పట్టు లేదు. ప్రెస్ మీట్లు పెట్టడం.. కేసీఆర్‌ను తిట్టడంతోనే కాలం వెల్లదదీస్తున్నారు. యథా రాజా తథా ప్రజా అన్నట్లు ముఖ్యమంత్రి స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, కిందిస్థాయి నేతల వరకు అంతా బూతులను కంఠస్థం చేస్తున్నారు. ప్రతిపక్షాలను తిట్టాలంటే ఆ బూతు పదాలనే వాడుతూ తమను తాము తక్కువ చేసుకుంటున్నారు. హామీల అమలు చేయాలన్న సోయి లేదు.. ప్రజల గుండెల్లో పది కాలాల పాటు నిలిచిపోవాలన్న కోరిక లేదు.. మళ్లీ అధికారంలోకి రావాలన్న ఆశ అంత కన్నా లేదు.. ఉన్న ఐదేళ్లలోనే ఏ టైం ఎలా ఉంటుందో తెలియక.. దోచుకోవడం, దాచుకోవడంపైనే ఫోకస్ పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని రిపోర్టు ఇస్తే.. ఐదేళ్లైతే అధికారంలో ఉంటాం కదా! అనే నాయకుడు ఉన్నాడంటే ప్రజల సమస్యలను వాళ్లు ఎంతలా పట్టించుకుంటున్నారో అర్థం చేసుకోవాలి. సీఎంకు హెలికాప్టర్ ఉంటే, తమకు ఎందుకు హెలికాప్టర్ లేదు.. తమకూ హెలికాప్టర్ కావాల్సిందేనని మారాం చేసే సంకుచిత స్వభావం ఉన్న నేతలున్నారు ఆ పార్టీలో. ఇప్పటికిప్పుడు ఆ పార్టీకి, ఆ పార్టీ నాయకులకు వచ్చిన ధోకా ఏమీ ఉండకపోవచ్చు. కానీ, మరో పదేళ్లు కాంగ్రెస్ పేరు ఎత్తాలంటేనే ప్రజలు అసహ్యించుకునేలా పరిస్థితి తయారవుతోంది. చివరగా, వామపక్షాలు ఉనికినే కోల్పోయాయి. కారణం.. వామపక్ష పెద్దోళ్ల వాదం కమ్యూనిజం. వాళ్ల పిల్లలు క్యాపిటలిజం. కార్యకర్తలు కష్టాలయిజం.

## వస్తే.. బీసీ పార్టీదే అధికారం

తెలంగాణలో ఎన్నడూలేని విధంగా బీసీ వాదం బలపడుతోంది. పార్టీలకు అతీతంగా బీసీలంతా ఏకం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వాళ్లంతా ఒక పార్టీ పెట్టి రంగంలోకి దిగితే.. తిరుగుండదు. దాన్ని అందరికంటే ముందుగా పసిగట్టింది కేసీఆర్. ఓటమి తర్వాత కేసీఆర్ ఎత్తుకున్న తొలివాదం బీసీ వాదం. బీసీ వాదం బలపడుతోందని గ్రహించిన మాజీ సీఎం.. గత ఏడాది సెప్టెంబర్‌లో మాజీ స్పీకర్ మధుసూదనాచారి నేతృత్వంలో 40 మంది బీఆర్ఎస్ ప్రతినిధుల బృందాన్ని తమిళనాడుకు పంపించారు. ఆ రాష్ట్రంలో బీసీలదే పెద్ద పీట. బీసీలు అధికారం సాధించడంలో ఎలా సఫలీకృతులు అయ్యారు? అని తెలుసుకొనేందుకు ఆ బృందం అక్కడికి వెళ్లి, తిరిగివచ్చి ఓ నివేదికను కేసీఆర్ చేతిలో పెట్టింది. ఆ నివేదిక ఆధారంగానే ప్రస్తుతం కేసీఆర్ పావులు కదుపుతున్నట్లు కనిపిస్తోంది. బీసీవాదాన్ని బీసీల కంటే ముందే కబ్జా చేసేందుకు కవితకు దిశానిర్దేశం చేశారా? ఆ దిశగానే కవిత బీసీవాదాన్ని బలంగా వినిపిస్తున్నారా? అంటే.. కేసీఆర్ స్ట్రాటజీ తెలిసినవాళ్లకు అవుననే అనిపిస్తుంది. తానే స్వయంగా బీసీ నినాదాన్ని ఎత్తుకున్నా, కేటీఆర్‌తో మాట్లాడించినా, పార్టీ నినాదంగా మలచినా బూమరాంగ్ అవుతుంది. పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఎందుకు చేయలేదు? అని కాంగ్రెస్, బీజేపీ చీల్చిచెండాడుతాయి. బీసీ నాయకుడు ఈటల రాజేందర్‌ను పార్టీ నుంచి వెళ్లగొట్టింది నిజం కాదా? ఎస్సీని సీఎం చేస్తానని మోసం చేసి, ఇప్పుడు బీసీలను కూడా మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఎండగడుతాయి. కాబట్టి.. జైలుకు వెళ్లొచ్చిన కవిత, పైగా మహిళ కాబట్టి ఆమే సరైన అస్త్రం అని భావించి కేసీఆర్ ఈ ఎత్తుగడ వేస్తున్నారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.



కవిత మహిళ కాబట్టి విపక్షాలు ఎక్కువ మాట్లాడితే వారిపై వీరతాండవం చేసేందుకూ అవకాశం కుదురుతుందనేదే కేసీఆర్ ఆలోచనగా తెలుస్తోంది. అటు రేవంత్ రెడ్డి తన సామాజిక వర్గానికే ప్రభుత్వంలో పెద్దపీట వేయడం, ఇటు.. బీజేపీ కూడా అగ్రకులానికే పెత్తనం కట్టబెట్టడం, బీఆర్ఎస్ సైలెంట్‌గా ఉండటం చూస్తుంటే.. తెలంగాణలో మరో పార్టీ పురుడు పోసుకోవాల్సిందేనన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, తెలంగాణ ఉద్యమకారుడు వీ ప్రకాశ్ లాంటి ఇంటెలెక్చువల్స్ బీసీలను సంఘటితం చేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతున్నారు. తీన్మార్ మల్లన్నలాంటి యువ నాయకులను ప్రోత్సహిస్తున్నారు.

**ఈ నేపథ్యంలో బీసీలంతా బీసీ నాయకులకు ఆర్థికంగా, రాజకీయంగా మద్దతు ప్రకటిస్తే వచ్చే ఎన్నికల్లో బీసీ రాజ్యాధికారం రావడం పక్కా.**

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.